Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 253 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 21 - 5 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015






**కుప్పంలో ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ముఖ్యమంత్రి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.**






**కుప్పంలో ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం తిరుగు ప్రయాణంలో ముఖ్యమంత్రి దంపతులు తంజమ్మకొట్టాలు వద్ద ఆగారు. కల్లుగీత కార్మికులు తాటిముంజలు తీస్తుండగా కాన్వాయ్‌ను నిలిపి వారి వద్దకు వెళ్లిన సీఎం చంద్రబాబు దంపతులు...ముంజలు తీసి ఇవ్వండి... రుచి చూస్తాం అని అడిగారు. కార్మికులు అందించిన తాజా తాటిముంజలను సీఎం దంపతులు రుచి చూశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికులతో ముఖ్యమంత్రి కాసేపు ఆత్మీయంగా సంభాషించారు. వారి పనితీరు, కుటుంబ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు.**

## 'జన్ జీ' కౌంటర్



బటన్లు నొక్కితే సింయంలు
కాలేరని షర్మిలమ్మ సూక్తులు
వెన్నలా కరిగిపోయెను చూడు
నేటి పాలకుల నిన్నటి హామీలు

ఎందుకో మారుతున్నది
కూటమి 'భాగస్వామి' స్వరం
రేపు ఏం జరుగబోతోందో
అది ఎవరికి కానున్నదో వరం

–కలిమిశ్రీ

## హస్తకళాకారులకు 365 రోజుల పాటు ఉపాధి కల్పనే లక్ష్యం: మంత్రి సవిత

**అమరావతి, (రాజధాని వార్తలు):** లేపాక్షి షోరూమ్‌లు, హస్తకళా రూపాల విక్రయాలపై మంత్రి సవిత బుధవారం సమీక్ష నిర్వహించారు. లేపాక్షి షోరూమ్‌లకు నూతన హంగులు ఇవ్వాలని మంత్రి సవిత సూచించారు. ఇప్పటికే మరమ్మతులు పూర్తి చేసిన ఢిల్లీ, కాకినాడ లేపాక్షి షోరూమ్‌లను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. త్వరలో రాజమండ్రి ఎయిర్‌పోర్టులో నూతన లేపాక్షి షోరూమ్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. హస్తకళా రూపాల అమ్మ కాలను పెంచడానికి ఈ–కామర్స్ వేదికను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. నేరుగా వినియోగదారుల ఇళ్లకు డోర్ డెలివరీ సౌకర్యం కల్పించాలన్నారు. హస్తకళాకారులకు సంవత్స రంలో 365 రోజుల పాటు ఉపాధి కల్పనే కూటమి ప్రభుత్వం లక్ష్యమని మంత్రి సవిత స్పష్టం చేశారు. ఈ సమావేశంలో లేపాక్షి ఎండీ విశ్వ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు..గడగడలాడుతున్న జనం

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ వేసవి సీజన్‌లోనే అత్యధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 47.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. అలాగే పిడుగు రాళ్ల తర్వాత అత్యధిక ఉష్ణోగ్రతలు కృష్ణా జిల్లా కంకిపాడు, మార్కా పురం జిల్లా నందనమారెళ్ల ప్రాంతాల్లో రికార్డ్ అయ్యాయి. ఈ రెండు ప్రాంతాల్లో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికా రులు వెల్లడించారు. ఇక పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డ్ అవుతున్నాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారుల హెచ్చరికల ప్రకారం రానున్న నాలుగు రోజుల పాటు



ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో అత్యవసర పనులు లేకపోతే బయటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.



# హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్

## - ప్రపంచ పర్యాటక పటంలో ఆంధ్రప్రదేశ్‌కు విశిష్ట స్థానం కల్పించే మహత్తర ఉద్యమం - దేశీయ పర్యాటకాభివృద్ధితో ఆర్థిక పురోగతి - ఉపాధి విస్తరణ - సాంస్కృతిక వైభవ ప్రాచుర్యమే లక్ష్యం : రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక & సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా, భవిష్యత్తులో ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం "హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్" పేరుతో ఏడాది పాటు కొనసాగే సమగ్ర పర్యాటక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక & సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఇది కేవలం ప్రచార కార్యక్రమం మాత్రమే కాకుండా, రాష్ట్ర పర్యాటక రంగానికి నూతన దిశానిర్దేశం చేసే ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకోనుందని మంత్రి స్పష్టం చేశారు. ఇది ఆంధ్రప్రదేశ్ పర్యాటక భవిష్యత్తుకు పునాది వేసే మహత్తర యత్నమన్నారు. ప్రభుత్వం, భాగస్వామ్య వర్గాలు, ప్రజలు అందరూ కలిసికట్టుగా పనిచేస్తే ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా నిలబెట్టగలం అనే సంపూర్ణ విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ మధ్యప్రాచ్య దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు మరియు అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో ఇంధన పొదుపు, విదేశీ పర్యటనల నియంత్రణతో పాటు దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయాలని గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ఇచ్చిన పిలుపు ఎంతో సమయోచితమని పేర్కొన్నారు. పర్యాటక పరంగా విదేశాలకు వెళ్లే భారతీయుల సంఖ్య ఏడాది ఏడాదికీ పెరుగుతుండగా, విదేశీ పర్యాటకులు భారతదేశానికి వచ్చే సంఖ్య తక్కువగా ఉండటం వల్ల దేశ సంపద విదేశాలకు వెళ్తోందన్నారు. ముఖ్యంగా వివాహ వేడుకలు, విశ్రాంతి పర్యటనలు, వినోద యాత్రల కోసం భారతీయులు విదేశాలకు అధికంగా వెళ్తున్నారని, ఆ ధోరణిని మార్చి దేశీయ పర్యాటకాన్ని ప్రజాదరణ పొందేలా చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందడుగు వేసి "హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్" ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని విశిష్ట పర్యాటక ప్రదేశాలను దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేయడంతో పాటు దేశీయ పర్యాటకులను ఆకర్షించే కార్యాచరణ చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని గండికోట వంటి "భారతదేశ గ్రాండ్ క్యానియన్"గా గుర్తింపు పొందిన ప్రదేశం నుంచి విశాఖపట్నం సముద్రతీర సౌందర్యం వరకు, అమరావతి ఆధ్యాత్మిక వైభవం నుంచి తిరుపతి భక్తి పర్యాటకం వరకు, మన్యం ప్రాంతాల సహజ అందాలు నుంచి గోదావరి-కృష్ణా-పెన్నా నదీ పరివాహక ప్రాంతాల సాంస్కృతిక సంపద వరకు ఆంధ్రప్రదేశ్ అపారమైన పర్యాటక సామర్థ్యాన్ని కలిగి ఉందని మంత్రి పేర్కొన్నారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు వస్తున్నప్పటికీ, శ్రీశైలం, పంచారామాలు, నవ వైష్ణవ క్షేత్రాలు వంటి అనేక ఆధ్యాత్మిక క్షేత్రాలను సమగ్ర యాత్రా మార్గాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందు కోసం సమగ్ర పర్యాటక వలయాల నమూనాను అమలు చేస్తామని తెలిపారు. అదేవిధంగా గమ్యస్థాన వివాహాల రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు. తిరుపతి, అరకు లోయ, విశాఖపట్నం సముద్రతీరాలు, ప్రకృతి రమణీయ ప్రాంతాల్లో వివాహ వేడుకలు నిర్వహించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి సమావేశాలు, పెట్టుబడి సదస్సులు, వ్యాపార సమావేశాలకు అనుకూలంగా సమావేశ-ప్రదర్శన కేంద్రాలను అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని వ్యాపార-పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా స్థిరపడిన తెలుగు ప్రజలు రాష్ట్ర పర్యాటకాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రతి ప్రవాస తెలుగు కుటుంబం కనీసం ఐదు విదేశీ కుటుంబాలను ఆంధ్రప్రదేశ్ పర్యటనకు ఆహ్వానించినా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు విశేష బలం చేకూరుతుందని,







ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పర్యాటక విధానంలో భాగంగా పలు పర్యాటక వలయాలను రూపొందించిందని, వసతి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాదిలోనే 42 హోటల్ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసి దాదాపు 9,500 కొత్త గదుల సామర్థ్యాన్ని కల్పించే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. సాహస పర్యాటకం, సముద్రతీర పర్యాటకం, అనుభూతి కేంద్రాలు వంటి రంగాల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. విశాఖపట్నం, చీరాల వంటి ప్రాంతాల్లో కొత్త సాహస క్రీడా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. విమాన, రైలు, రహదారి, జలమార్గ అనుసంధాన పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యుత్తమ స్థితిలో ఉందని మంత్రి స్పష్టం చేశారు. విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, కర్నూలు, కడప విమానాశ్రయాలతో పాటు త్వరలో గుంటూరు సమీపంలో భారీ అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి చెందుతోందన్నారు. పర్యాటకుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొంటూ, ఆలయాలు మరియు పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను గణనీయంగా పెంపొందించామని తెలిపారు. సేవల నాణ్యతను ఆధునీకరిస్తూ పర్యాటకులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన అనుభవాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అంతకుముందు రాష్ట్ర సచివాలయంలో హోటల్ సంఘాలు, పర్యాటక నిర్వహణ సంస్థలు, వినోద పార్కుల నిర్వాహకులు, వివాహ వేడుకల ప్రణాళికకర్తలు, సామాజిక మాధ్యమ ప్రభావశీలులు మరియు ఇతర భాగస్వామ్య వర్గాలతో విస్తృత స్థాయిలో సమావేశం నిర్వహించడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న భాగస్వామ్య వర్గాలు ప్రభుత్వ కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చాయని మంత్రి వెల్లడించారు. హోటల్ యాజమాన్యాలు ప్రత్యేక రాయితీ ధరలు ప్రకటించేందుకు సిద్ధమయ్యాయని, పర్యాటక నిర్వహణ సంస్థలు వివిధ ప్రాంతాలను అనుసంధానించే ప్రత్యేక యాత్రా ప్యాకేజీల రూపకల్పనపై ముందుకు వచ్చాయని తెలిపారు. ఒకరోజు పర్యటనకు వచ్చే సందర్శకులను రెండు-మూడు రోజులపాటు రాష్ట్రంలోనే ఉండేలా ఆకర్షణీయ కార్యక్రమాలు రూపొందించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ మధ్యప్రాచ్య మరియు అంతర్జాతీయ సంక్షోభాల నేపథ్యంలో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు విదేశీ పర్యటనలను తగ్గించి దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. విదేశీ మారకద్రవ్య పొదుపుతో పాటు దేశీయ ఉపాధి అవకాశాలు పెంపొందించడమే దీని లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

గత ఏడాది భారత్‌కు 90 లక్షల మంది విదేశీ పర్యాటకులు రాగా, 3.4 కోట్ల మంది భారతీయులు విదేశాలకు వెళ్లిన విషయాన్ని ఆయన వెల్లడిచేస్తూ ముఖ్యంగా గమ్యస్థాన వివాహాల కోసం విదేశాలకు వెళ్లే ధోరణిని మార్చాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ నేపథ్యంలో "హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్" పేరుతో ఏడాది పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభి స్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలను ప్రోత్స హించి, దేశీయ పర్యాటకులను ఆకర్షించేందుకు సమగ్ర కార్యా చరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంపై నిర్వహించిన భాగస్వామ్య వర్గాల సమావేశంలో హోటల్ యాజమాన్యాలు, ప్రయాణ నిర్వహకులు, వివాహ వేడుకల ప్రణాళికకర్తలు, సామాజిక మాధ్యమ ప్రభావశీలులు తదితర రంగాలకు చెందిన ప్రతినిధులు దాదాపు 200 మంది ప్రత్యక్ష మరియు వర్చువల్ విధానంలో పాల్గొని తమ విలువైన సూచనలు అందజేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ఇన్‌ఛార్జ్ మేనేజింగ్ డైరెక్టర్ పద్మావతి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎండలు ముదురుతున్నాయ్.. అప్రమత్తంగా ఉండాలి

## - తగిన జాగ్రత్తలతో వడ 'దెబ్బ'కు దూరంగా ఉండొచ్చు - వైద్య, ఆరోగ్య శాఖ సలహా సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఉన్నతాధికారులతో సమీక్ష - మార్చి నుంచి ఇప్పటివరకు 325 అనుమానిత వడదెబ్బ కేసులు నమోదైనట్లు మంత్రికి తెలిపిన అధికారులు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం పిలుపునిచ్చింది. ప్రభుత్వం జారీ చేసే హెచ్చరికలు, వైద్యుల సూచనలు అనుసరించి జాగ్రత్తలు పాటించాలని వైద్య, ఆరోగ్య శాఖ సూచించింది. పై నుంచి భగభగమంటున్న భానుడి కిరణాలు, కింద నేల నుంచి ఎగసే సెగలు ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మండిపోయే ఈ ఎండల ధాటికి చాలా మందికి నీరసం, నిస్సత్తువ అవరిస్తోంది. వడదెబ్బ (హీట్ స్ట్రోక్)గా పిలిచే ఈ విపత్తు నుంచి తప్పించుకోవడానికి తగిన జాగ్రత్తలు అవసరమని వైద్య ఆరోగ్య శాఖ పేర్కొంది. అధిక ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు డీహైడ్రేషన్, వడదెబ్బ, బారిన పడకుండా జాగ్రత్త పడాలని తెలిపింది. వేసవిలో వడదెబ్బ ముప్పు అధికం. శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య వడగాలులు, ఎండ తీవ్రత విపరీతంగా ఉంటుంది. ఈ సమయంలో బయట తిరగకుండా ఉంటే మంచిది. వీలైనంత వరకు ప్రయాణాలు తగ్గించుకోవడం మంచిది. తరచుగా నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రవాలు తీసుకోవాలి. కనీసం రోజుకు మూడు నుంచి నాలుగు లీటర్ల వరకు నీరు తాగితే మంచిది. చిన్నారులు, వృద్ధుల విషయంలో కుటుంబ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ తెలిపిశీది. దీర్ఘకాలిక రోగులు సాధ్యమైనంత వరకు ఇళ్ల వద్ద ఉంటే మంచిదని వెల్లడించింది. రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో వైద్య ఆరోగ్య శాఖ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎండల తీవ్రత-సన్నద్ధతపై మంత్రి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ఎండల తీవ్రత సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఓ పత్రికా ప్రకటనలో అధికారులు పేర్కొన్నారు.

### మరింత అప్రమత్తంగా ఉండాలి : మంత్రి సత్యకుమార్

సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ..ఎండలు రోజురోజుకి ముదిరిపోతున్న నేపథ్యంలో అన్ని స్థాయిల్లోని వైద్య సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. వడదెబ్బ పీడితులకు వైద్య సేవలు అందించేందుకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల దగ్గర నుంచి బోధనాసుపత్రుల వరకు సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా దీర్ఘకాల వ్యాధులతో బాధపడే వారు, వయోవృద్ధులు, గర్భిణిలు, చిన్నారుల విషయంలో తగిన జాగ్రత్తలు అవసరమని సమీక్షా సమావేశంలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండియన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునంధన్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు. సమావేశంలో అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 1 నుంచి మే 19వ తేదీ వరకు 325 అనుమానిత వడదెబ్బ కేసులు నమోదైనట్లు చెప్పారు. ముఖ్యంగా ఈ నెల 1 నుంచి మంగళవారం వరకు 96 కేసులు నమోదైనట్లు చెప్పారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం అత్యధికంగా విశాఖ జిల్లాలో 24, కాకినాడ-17, విజయనగరం-13, వైఎస్సార్ కడప-11, చిత్తూరు, ఏలూరు జిల్లాల్లో 5 చొప్పున కేసులు రికార్డయ్యాయని తెలిపారు. మరణాలు నమోదు కాలేదు. 2025లో మార్చి 1 నుంచి మే 4వ తేదీ మధ్య 1,692 కేసులు రికార్డయ్యాయని మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మునిసిపల్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, పోలీసు, ఫైర్ అండ్ సేఫ్టీ, ఇతర శాఖల సమన్వయంతో ఇంకా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### 1.44 కోట్ల ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం

"రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 1,44,29,076 ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయి. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కలిపి కోటి వరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలో అత్యధికంగా 10,20,099 ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయి. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్, బోధనాసుపత్రుల్లో మిగిలిన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. గడిచిన వారంలో 2,57,100 ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ జరిగింది. రోగులతోపాటు ఆరోగ్య సిబ్బందికి ఇవి అందించామని" అని అధికారులు మంత్రి సత్యకుమార్‌కు వివరించారు. అత్యవసర సందర్భాల్లో 108 అంబులెన్సులు వాడేందుకు వీలుగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని తెలిపారు.

### 'అవేర్' ఆధారంగా జిల్లా అధికారుల అప్రమత్తం

అవేర్ (అడ్వాన్స్ వార్నింగ్ అడ్వైయిజరీ ఫర్ రెసిలియెంట్ ఎకోసిస్టం) ద్వారా రానున్న నాలుగైదు రోజుల వేసవి తీవ్రత గురించిన సమాచారాన్ని జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులకు వైద్యారోగ్య శాఖ అధికారులు పంపుతున్నారు. అవేర్ ఆధారంగా రాష్ట్రంలోని జిల్లాలు, మండలాల వారీగా వేసవి తీవ్రత ఎలా ఉండబోతుందో తెలుస్తుంది. ఈ సమాచారాన్ని యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్ కాస్ట్ నుంచి తీసుకుంటున్నారు. 27 డిగ్రీల సెంటిగ్రేడ్ నుంచి 32 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత నమోదు జరిగితే దానిని హెచ్చరిక(కాషన్)గా గుర్తిస్తున్నారు. 33 డిగ్రీల సెంటిగ్రేడ్ నుంచి 41 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత నమోదైతే దానిని అపాయం (డేంజర్)లో ఉన్నట్లు, 42 నుంచి 54 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత నమోదైతే దానిని మరింత అపాయం (వెరీ డేంజర్)గా అవేర్ డిజిటల్ ప్లాట్‌ఫాంలో గుర్తిస్తారు.

# నేటి నుండి హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రారంభం

## - టూరిజంలో ఏపీని అగ్రస్థానంలో నిలపాలి - హాలిడే టూరిజంకు అధిక ప్రాధాన్యత - ఏపీలో టూరిజంకు ఉజ్వల భవిష్యత్ ఉంది - టెంపుల్ టూరిజమ్, డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు ప్రాధాన్యత





**అమరావతి, (రాజధాని వార్తలు):** సొంత లాభం కొంత మానుకుని పొరుగువాడికి తోడుపడవోయ్ అన్న చందాన రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి స్టేక్ హోల్డర్స్ అందరూ సహకరించాలని పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫి శాఖామాత్యులు కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. ఏపీ సచివాలయంలోని రెండవ బ్లాక్ లోని సమావేశ మందిరంలో టూరిజం అభివృద్ధిపై మంత్రి కందుల దుర్గేష్ వర్చువల్ సమావేశంను బుధవారం నిర్వహించారు. ముందుగా హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్ పోస్టర్ ను మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖాధికారులు లాంచనంగా ప్రారంభించారు. ఈ సంరద్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ యుద్ధ వాతావరణ నేపథ్యంలో ప్రధానమంత్రి మోదీ పిలుపులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశంలో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పరుగులు పెట్టించడానికి పర్యాటక శాఖ పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రతి ఒక్కరూ తమ సహకారాన్ని అందించాలని మంత్రి తెలిపారు. డెస్టింగ్ వెడ్డింగ్‌లను మన రాష్ట్రంలోనే నిర్వహించుకోవాలని సూచించారు. దీంతో విదేశీమారక నిల్వలను కాపాడుకోవచ్చన్నారు. మన రాష్ట్రంలో గండికోట, అరకు వ్యాలీ, వైజాగ్, కోనసీమ ఇలా ఎన్నో ప్రకృతి అందాలతో అలరారే ప్రాంతాలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రజలను చైతన్యవంతం చేసి పర్యాటక రంగానికి ఊతమిచ్చేందుకు హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే కార్యక్రమంను ఏడాది పాటు నిర్వహించనున్నామన్నారు. దీంతో ఆయా ప్రాంతాలు పర్యాటకంగా అభివృద్ధి చెందటంతో పాటు స్థానిక యువతకు ఉపాధి, హోటళ్లు, స్టే హోమ్‌లు, రవాణా రంగాల వారికి అధిక ఆదాయం లభిస్తుందని వివరించారు. పర్యాటకులకు అద్భుతమైన జ్ఞాపకంగా మిగిల్చే విధంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను తీర్చిదిద్దుతామన్నారు. ఎయిర్ పోర్ట్ టూ ఎయిర్ పోర్ట్ ప్యాకేజీలు కూడా పర్యాటకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పర్యాటకంగా ఏపీ నిలస్తుందనటానికి నిదర్శనమే ఈ ఏడాది టూరిజం ప్రోమోషన్ సిటిగా అవార్డు అందుకోనున్నామని, వచ్చే నెల 4న ఈ అవార్డు అందుకోనున్నామని, ఇది గర్వకారణమని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, ఏపీటీడీసీ ఇన్‌చార్జి ఎండీ పద్మావతి, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, ఈడీ శేషగిరిరావు, స్టేక్ హోల్డర్స్ పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఐ పద్ధతులు, సంక్షేమ కార్యక్రమాల అధ్యయనం కోసం ఏపీలో పర్యటిస్తోన్న తెలంగాణ ఎన్ఆర్ఐ సలహా కమిటీ



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఎన్ఆర్ఐ భవన్‌లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో 'తెలంగాణ ప్రభుత్వ ఎన్ఆర్ఐ సలహా కమిటీ' సమావేశం. ఏపీలో అమలవుతున్న ఉత్తమ ఎన్ఆర్ఐ పద్ధతులు, సంక్షేమ కార్యక్రమాల అధ్యయనం కోసం ఏపీలో పర్యటిస్తోన్న తెలంగాణ ఎన్ఆర్ఐ సలహా కమిటీ. గల్ఫ్ వలసదారులు, విదేశీ కార్మికుల సంక్షేమంపై ఏపీలో అమలవుతున్న పద్ధతులపై కమిటీ అధ్యయనం.

ప్రవాసాంధ్రుల సంక్షేమం, సమస్యల పరిష్కారంలో ఏపీ ప్రభుత్వం గొప్పగా పనిచేస్తోందన్న మంత్రి కొండపల్లి. ఏపిఎన్ఆర్‌టి విధానాలపై తెలంగాణ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్న తెలంగాణ ఎన్ఆర్ఐ సలహా కమిటీ.

# ఐదేళ్ల తాగునీటి సమస్యకు పరిష్కారం

## - ఎన్టీఆర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి - అన్ని మౌళిక సదుపాయాలు కల్పిస్తామని హామీ - రాబోయే రోజుల్లో ఇల్లు లేని వారికి ఇల్లు ఇస్తామన్న ఎమ్మెల్యే





**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు నియోజకవర్గం, దామరమడుగు పంచాయతీ, ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో ఐదారు సంవత్సరాలుగా నెలకొన్న తాగునీటి సమస్యను స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పరిష్కరించారు. మంగళవారం ఆమె తాగునీటి సరఫరాను ప్రారంభించారు. స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో గత ఐదారు సంవత్సరాలుగా ఒక్క చుక్క తాగునీరు కూడా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తన దృష్టికి తీసుకు వచ్చారని తెలిపారు. ఈ కాలనీలో సుమారు 315 ప్లాట్లు ఉండగా, గత ప్రభుత్వం 200 మందికి కేటాయించినట్లు చెప్పారు. ప్రస్తుతం సుమారు 100 కుటుంబాలు నివాసం ఉంటుండగా, మిగతా వారు ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టలేదన్నారు. ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు కూడా కనీస మౌళిక సదుపాయాలు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. తాగునీరు, వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి సదుపాయాల లేమితో ప్రజలు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమా నికి సమాన ప్రాధాన్యం ఇస్తూ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ ప్రజల కోసం ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుం టోందన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో ఇప్పటికే రూ.11 లక్షల 25 వేల వ్యయంతో వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేశామని, ఈ రోజు కాలనీ ప్రజలకు తాగునీటి సరఫరా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. రానున్న 15 రోజుల్లో మరో రూ.6 లక్షలు ఖర్చు చేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక మహిళలు కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు లేవని తన దృష్టికి తీసుకువచ్చారని, తప్పకుండా కొత్త లైట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అదేవిధంగా పేదలు అధికంగా నివసిస్తున్న ఈ ప్రాంతంలో రాబోయే రోజుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు కూడా కల్పిస్తామని వెల్లడిం చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలాగే ఖాళీగా ఉన్న అనేక హౌసింగ్ కాలనీలు గుర్తించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయితే ఇల్లు లేని పేదలకు వాటిని అందించే అవకాశం లేకుండా గత ప్రభుత్వం పని చేసిందని విమర్శించారు. ఆ లోపాలను సరిదిద్ది రాబోయే రోజుల్లో కోవూరు నియోజకవ ర్గంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇన్ని సంవత్సరాలుగా ఈ కాలనీలో నీటి సమస్యలు ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని, కానీ మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బోరు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు అందించామని ఎమ్మెల్యే అన్నారు.

**సేవ చేయడానికి ముందుకు రావాలి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచిస్తున్న పీ4 అనంతరం విధానం ద్వారా పేదరిక రహిత సమాజ నిర్మాణం సాధ్యమవు తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమాజంలో ఉన్నవారు లేనివారికి అండగా నిలవాలని సీఎం పిలుపునిస్తున్నారని తెలిపారు. అదే పీ4 స్ఫూర్తితో కరిముల్లా అన్న స్థలం అందించడంతో బోరు ఏర్పాటు చేసి కాలనీ ప్రజలకు తాగునీరు అందించగలిగామని చెప్పారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ కాలనీ ప్రజల తరఫున కరిముల్లాకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇలా ఒకరిని చూసి మరొకరు ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుకు రావాలని ఎమ్మెల్యే కోరారు. తాము మొదట 2016లో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా వీపీఆర్ విద్య కింద 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు చదువు అందించామని తెలిపారు. ఇప్పటి వరకు చాలా పదో తరగతి బ్యాచ్‌లు బయటకు వెళ్లాయని, విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకున్నారని పేర్కొ న్నారు. ఇటీవల తమ పాఠశాలలో ఒక విద్యార్థిని 594 మార్కులు సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆటోడ్రైవర్లు, తాపీ మేస్త్రీలు వంటి పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించి వారి భవిష్యత్తు బంగారంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. అలాగే ఈ ఏడాది దామరమడుగు ప్రభుత్వ హైస్కూలులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ పిల్లలు రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు సాధించాలని ఆశీర్వదించి ప్రోత్సహించిన ఆది నారాయణ అన్నకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నగదు బహుమతి అందుకున్న విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేస్తూ, ఇంకా ఉన్నత చదువులు అభ్యసించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం ఆమె ఏపీ ఎంస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఎంట్రప్రెన్యూర్‌షిప్ కమ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని కూడా సందర్శించారు.

# 50 రోజుల్లోనే జిల్లాలో 7 ప్రధాన పరిశ్రమలు

## - రూ.10 వేల కోట్ల పెట్టుబడులు, 75 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తుమ్మలపెంట గ్రామంలో జరిగిన మత్స్యకార సేవలో కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ, ఏప్రిల్ 1వ తేది వింజమూరు సీఎం పర్యటన అనంతరం కేవలం గత 50 రోజులలోనే జిల్లాలో 7 ప్రధాన పరిశ్రమలు గ్రౌండింగ్ దశకు చేరుకోవడం గర్వించదగ్గ విషయమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. వేట నిషేధ సమయంలో ప్రతి మత్స్యకార కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న రూ.20,000 ఆర్థిక సహాయం వారికి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా 1,30,796 మంది మత్స్యకారులకు మొత్తం రూ.261.5 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. మన నెల్లూరు జిల్లాలోనే 11,644 మంది మత్స్యకారులకు రూ.23.2 కోట్ల ఆర్థిక సహాయం అందించడం సంతోషకరమన్నారు. ముఖ్యమంత్రి విజన్, పరిశ్రమల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి వల్ల నెల్లూరు జిల్లాకు భారీ పెట్టుబడులు ఆకర్షితమవుతున్నాయి. గతంలో ఉన్న పరిశ్రమలకు అదనంగా, కేవలం గత 50 రోజులలోనే వింజమూరు పర్యటన అనంతరం జిల్లాలో 7 ప్రధాన పరిశ్రమలు శ్యామ్ మెటాలిక్స్ అండ్ ఎనర్జీ లిమిటెడ్, అనంత్ టెక్నాలజీస్, ఆదిత్య ప్రెసిటెక్ లిమిటెడ్, ఆర్ఆర్ ఇండస్ట్రీస్, ఫర్నిచర్ పార్క్, అపోలో టైర్స్ లిమిటెడ్, విశాఖ ఇండస్ట్రీస్ వంటి సంస్థలు జిల్లాలో పెట్టుబడులు పెడుతున్నాయి. వీటి ద్వారా జిల్లాకు సుమారు రూ.10 వేల కోట్ల పెట్టుబడులు రానుండగా, 75 వేలకుపైగా ఉద్యోగ అవకాశాలు కలగనున్నాయని కలెక్టర్ వివరించారు. కావలి సమీప ప్రాంతాల్లో భారీ పారిశ్రామిక ప్రాజెక్టులు వేగంగా రూపుదిద్దుకుంటున్నాయని, ఇక్కడి నుంచి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో రామయ్యపట్నం పోర్టు నిర్మాణం జరుగుతోందన్నారు. పోర్ట్ సమీపంలోనే బీపీసీఎల్ ఆధ్వర్యంలో దేశంలోనే అతిపెద్ద రిఫైనరీ ఏర్పాటవుతోందన్నారు. అలాగే ఇండోసోల్ సంస్థ రూ.69 వేల కోట్లతో సోలార్ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తుండగా, ఇఫ్కో కిసాన్ సెజ్ రూ.10 వేల కోట్ల పెట్టుబడులతో ముందుకు సాగుతోంది. దగదర్తి ఎయిర్‌పోర్టుకు రూ.1,000 కోట్ల పెట్టుబడితో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా జిల్లాలో సుమారు 1 లక్ష 17 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని కలెక్టర్ చెప్పారు. కావలి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయడానికి సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం. రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్ ప్రాజెక్టుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని సుమారు 25 వేల ఎకరాల్లో ఈ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా 30 వేల మందికి ఉపాధి అవకాశాలు, 10 వేల కుటుంబాలకు నివాస సదుపాయాలు కల్పించడంతో పాటు స్థానిక యువత, యానాది గిరిజనులు మరియు ఎస్సీ వర్గాలకు ప్రయోజనం చేకూరనుంది. పోర్టు పరిసర గ్రామాల్లో రోడ్లు, పరిశ్రమలు, నివాసాలు మరియు ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ఈ మాస్టర్ ప్లాన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యమంత్రికి ఉన్న విజన్, ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలతో నెల్లూరు జిల్లా పరిశ్రమల హబ్‌గా అభివృద్ధి చెందుతోందని, ఇందుకు జిల్లా ప్రజల తరపున కలెక్టర్ ముఖ్యమంత్రికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# సీఎం పర్యటన విజయవంతం చేసిన అందరికి అభినందనలు : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనను విజయవంతంగా నిర్వహించిన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు విభాగం సిబ్బంది, మీడియా ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయడంతో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ముఖ్యమంత్రి తుమ్మలపెంట పర్యటన సజావుగా పూర్తయిందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను విస్తృతంగా చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషించిందని ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఉత్సాహం, నిబద్ధతతో భవిష్యత్‌లో కూడా అత్యంత ప్రముఖులు, ప్రముఖుల పర్యటనలను, ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్



పిలుపునిచ్చారు.

# మత్స్యకారుల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్న ప్రభుత్వం మనదే : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

## - కోవూరు నియోజకవర్గంలోని 3,392 మత్స్యకార కుటుంబాలకు రూ.6.78 కోట్ల ఆర్థిక సాయం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమం మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే కాకుండా, వారి ఆత్మగౌరవాన్ని కాపాడే దిశగా ముందుకు సాగుతోందన్నారు. మంగళవారం కావలి మండలం తుమ్మలపెంటలో జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా 1.30 లక్షల మత్స్యకార కుటుంబాలకు వేట నిషేధ భృతిగా రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గ పరిధిలోని కొల్లిమిట్ట పాళెం గ్రామంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆమె నేరుగా సీఎం కార్యక్రమం నుంచి కొల్లిమిట్ట పాళెం వెళ్లారు. మత్స్యకార కుటుంబాలను ఉద్దేశించి ప్రసంగించారు. ఎండలను సైతం లెక్క చేయకుండా ప్రజల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కష్టపడుతున్నారని ఆమె పేర్కొన్నారు. వేట నిషేధ కాలమైన ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు 61 రోజులు సముద్రంపై ఆధారపడి జీవించే గంగపుత్రుల కుటుంబాల చాలా ఇబ్బందులు పడుతాయని తెలిపారు. ఈ సమస్యలను గుర్తించి ప్రభుత్వం ఈ భృతిని అందిస్తోందన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి 2014లోనే చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని, అంతకు ముందే అన్నగారు, తెలుగుదేశం వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు మత్స్యకారుల అభ్యున్నతికి విశేష సేవలు అందించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో మత్స్యకారులకు కేవలం రూ.10 వేల భృతి మాత్రమే అందించారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దాన్ని రూ.20 వేలుకు పెంచిందని వివరించారు. అలాగే ప్రమాద బీమాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి మత్స్యకార కుటుంబాలకు మరింత భరోసా కల్పించిందని తెలిపారు. దేవుడి దయవల్ల ప్రమాదాలు జరగకూడదని కోరుకుంటున్నామని, ఒకవేళ అనుకోని ప్రమాదాలు జరిగితే, కుటుంబాలు రోడ్డున పడకుండా ఉండేందుకు ప్రభుత్వం వెంటనే బీమా సాయం అందజేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమ బోట్ల సమస్యతో స్థానిక మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వలలు చిరిగిపోవడం వల్ల వేటకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ సమస్యను మొట్టమొదట తానే అసెంబ్లీలో ప్రస్తావించినట్లు గుర్తుచేశారు. ఇటీవల జరిగిన దురదృష్టకర ఘటన అనంతరం ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టిందన్నారు. మత్స్యకారులకు భద్రత కల్పించిందని చెప్పారు. గత ప్రభుత్వంలో రూ.10 వేలుగా ఉన్న వేట నిషేధ భృతిని ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.20 వేలకు పెంచిందని, అదే విధంగా రూ.5 లక్షలుగా ఉన్న మత్స్యకార బీమాను రూ.10 లక్షలకు రెట్టింపు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. పోయిన సంవత్సరం మొదటిసారి రూ.20 వేలు ఇచ్చారని, ఈ సంవత్సరం 2026లో మే 19న రూ.286 కోట్లు నేరుగా మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం రూ.28 కోట్లు అదనంగా అందజేశారని వివరించారు. సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా ప్రతి మత్స్యకార కుటుంబానికి మేలు జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. కోవూరు నియోజకవర్గంలో మొత్తం 755 బోట్లను గుర్తించి, అర్హులైన 3,392 మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున మొత్తం రూ.6 కోట్ల 78 లక్షల 40 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. విడవలూరు మండలంలో 428 బోట్లకు సంబంధించిన 2,081 కుటుంబాలకు రూ.4 కోట్ల 16 లక్షల సాయం, ఇందుకూరుపేట మండలంలో 327 బోట్లకు చెందిన 1,311 కుటుంబాలకు రూ.2 కోట్ల 62 లక్షల 20 వేల సాయం అందిందని పేర్కొన్నారు. ఈ సాయం కేవలం ఆర్థిక విషయం మాత్రమే కాదు, మత్స్యకారుల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని ఎమ్మెల్యే నొక్కి చెప్పారు. మత్స్యకారులు అంటే గర్వంగా చెప్పుకునే స్థాయికి తీసుకెళ్తున్నారని, నాడు వ్యాపారులకు కూలీలుగా ఉన్న మత్స్యకారులను ఆత్మగౌరవంతో జీవించేలా చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 'తీరం మనదే, బోటు మనదే, వేట మనదే ఇది సీబీఎన్ మాట' అని ముఖ్యమంత్రి తుమ్మలపెంటలో చెప్పిన మాటల స్ఫూర్తి ఇదేనని పేర్కొన్నారు. మత్స్యకార కార్పొరేషన్ కమిటీ ఏర్పాటు చేయాలని తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని, ఆయన పరిశీలిస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. మత్స్యకారులను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేసే వారిని ప్రజలే గమనిస్తున్నారని, ఎవరు నిజంగా మత్స్యకారుల పక్షాన నిలబడ్డారో ప్రజలకు స్పష్టంగా తెలుసన్నారు. తీరప్రాంత గంగపుత్రుల ఆత్మగౌరవాన్ని కాపాడే ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వమని, యువ నాయకుడు నారా లోకేష్ కూడా మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని తెలిపారు.

ఇంత ఎండలో కార్యక్రమంలో పాల్గొన్న మత్స్యకార సోదరీ సోదరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అందరి ఖాతాల్లో రూ.20 వేలు జమ అయ్యాయని భావిస్తున్నామని, వేట నిషేధ సమయంలో యువకులు ఏ పనిలో నిమగ్నమవుతున్నారో వచ్చి మాట్లాడాలని కోరారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## కొత్త ప్రపంచానికి భారత్ ఇటలీ బాట

భారత్-ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు కీలక మలుపులో నిలిచిన తరుణమిది. స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు, భవిష్యత్తుపై సంయుక్త ఆశావహ దృక్పథం ప్రాతిపదికన ఇటీవలి కాలంలో ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా అవి రూపాంతరం చెందాయి. అంతర్జాతీయ వ్యవస్థ ప్రగాఢ మార్పులకు లోనవుతున్న ప్రస్తుత సందర్భంలో అత్యున్నత రాజకీయ, సంస్థాగత స్థాయిలలో క్రమబద్ధ ఆదానప్రదానాలు రెండు దేశాల భాగస్వామ్యాన్ని నిర్దేశిస్తున్నాయి. ప్రస్తుత 21వ శతాబ్దంలో ఆయా దేశాల ఆవిష్కరణ సామర్థ్యం, ఇంధన పరివర్తన నిర్వహణ, వ్యూహాత్మక సార్వభౌమత్వ బలోపేతం తదితరాలు ప్రజా శ్రేయస్సు, జాతీయ భద్రత వంటి అంశాలపై ఆధారపడి ఉన్నాయి. ఈ విషయంలో మా ఉమ్మడి అవగాహనను రెండు దేశాల మధ్య సహకారం ప్రస్ఫుటం చేస్తోంది. ఈ దిశగా కొత్త పరస్పర పూరక బలాల ఏకీకరణ సహా ద్వైపాక్షిక బంధాన్ని మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దడంపై మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం. అంతర్జాతీయ స్థాయి సూపర్ కంప్యూటర్ల తయారీ నైపుణ్యంతో పారిశ్రామిక కూడలిగా ప్రపంచంలో ఇటలీకి ప్రముఖ స్థానం ఉంది. అదేవిధంగా 100కు పైగా యూనికార్న్ సంస్థలు సహా 2,00,000 అంకుర సంస్థలతో భారత్ శరవేగంగా ఆర్థికవృద్ధిని సాధిస్తోంది. దీంతోపాటు ఇంజనీరింగ్ ప్రతిభ--విస్తృతి, ఆవిష్కరణ-వ్యవస్థాపనావరణ వ్యవస్థలను కలిగి ఉంది. రెండు దేశాలకు గల ఈ సామర్థ్యాల మధ్య శక్తిమంతమైన సమన్వయ సాధన లక్ష్యాన్ని మేము నిర్దేశించుకున్నాం. ఇది మా పారిశ్రామిక బలాలను పరస్పరం బలోపేతం చేసుకునే విలువల వ్యవస్థను సంయుక్తంగా సృష్టిస్తుంది. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు ఇనుమడించేందుకు ఐరోపా సమాఖ్య-భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) బాటలు వేస్తుంది. రక్షణ-ఏరోస్పేస్, కాలుష్య రహిత సాంకేతికతలు, యంత్రాలు, ఆటోమోటివ్ విడిభాగాలు, రసాయన-ఔషధ, జౌళి, వ్యవసాయ-ఆహార, పర్యాటకం సహా మరిన్ని రంగాలపై 'ఎఫ్‌టీఏ' దృష్టి సారిస్తుంది. తద్వారా 2029 నాటికి ఇటలీ-భారత్ మధ్య నిర్దేశిత 20 బిలియన్ యూరోల వాణిజ్య లక్ష్యాన్ని చేరడంతో సరిపెట్టకుండా దాన్ని అధిగమించాలన్నది మా ఆకాంక్ష. 'మేడ్ ఇన్ ఇటలీ' అనేది అంతర్జాతీయంగా అత్యుత్తమ నాణ్యతకు పర్యాయ పదబంధం. ఇప్పుడిది 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమ నిర్దేశిత ఉన్నత నాణ్యత లక్ష్యంతో సహజ సమన్వయం ఏర్పరుచుకుంటుంది. ఈ నేపథ్యంలో భారత్ కోసం ఉత్పాదన దిశగా ఇటలీ వ్యాపార సంస్థలలో ఆసక్తి పెరుగుతోంది. మరోవైపు ఇటలీలో భారత పరిశ్రమల సంఖ్య కూడా పెరగడం (ప్రస్తుతం రెండువైపులా వీటి సంఖ్య 1000కి పైగానే) మా సరఫరా వ్యవస్థల ఏకీకరణను బలోపేతం చేసే సానుకూల సంకేతం. మా భాగస్వామ్యానికి సాంకేతిక ఆవిష్కరణలే పునాది. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం కంప్యూటింగ్, అత్యాధునిక తయారీ, కీలక ఖనిజాలు, డిజిటల్ సదుపాయాలు వంటి రంగాల్లో నేటి పురోగమన వేగం రాబోయే దశాబ్దాల్లో సాంకేతిక విప్లవంగా రూపుదిద్దుకోగలదు. ఈ క్రమంలో చైతన్యవంతమైన భారత ఆవిష్కరణావరణ వ్యవస్థ, అత్యంత నైపుణ్యంగల వృత్తి నిపుణుల వనరులు, ఇటలీకిగల నవనవీన పారిశ్రామిక సామర్థ్యం మేళవింపుతో పైన పేర్కొన్న రంగాలన్నిటా మా సహకారం వ్యూహాత్మకంగా రూపొందుతుంది. రెండు దేశాల్లోని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యం ఈ పరిణామశీలతకు ఇతోధికంగా తోడ్పడుతుంది. ఇక భారత సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఇప్పటికే అనేక దేశాల్లో, ముఖ్యంగా వర్ధమాన ఆర్థిక వ్యవస్థలలో సానుకూల స్పందన లభిస్తోంది. కృత్రిమ మేధ రంగం.. మా రెండు దేశాలతోపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా ఇప్పటికే తనదైన ముద్ర వేసింది. ఈ ఆధునిక సాంకేతికత పురోగమనం బాధ్యతాయుతంగా, మానవాళి కేంద్రితంగా కొనసాగేలా చూడటంలో భారత్, ఇటలీ కృషి చేస్తున్నాయి. ఈ దృక్కోణంతో 'ఏఐ'ని సార్వజనీన ప్రగతికి.. ప్రత్యేకించి వర్ధమాన దేశాలకు ఒక శక్తిమంతమైన సాధనంగా మేం పరిగణిస్తున్నాం. సాంకేతికత పరిజ్ఞానాలను మానవాళి కేంద్రితంగా ఉంచేందుకు 'మానవ్' పేరిట భారత్ ఒక దార్శనిక విధానం అనుసరిస్తోంది. అదేవిధంగా మానవతావాద సంప్రదాయంలో పాదుకున్న మానవ-కేంద్రక 'అల్గార్-ఎథిక్స్'ను ప్రోత్సహించడంలో ఇటలీ ముందంజ వేసింది. ఈ రెండు దృక్కోణాలు ప్రాతిపదికగా కృత్రిమ మేధ పరిజ్ఞానం సామాజిక సాధికారతను ఉత్తేజితం చేయాలన్నది మా భాగస్వామ్యం నిర్దేశించుకున్న లక్ష్యం. ఈ దిశగా భారత డిజిటల్ స్థాయిని, ఇటలీ నైతిక- పారిశ్రామిక నైపుణ్యాన్ని మేళవిస్తూ సాంకేతిక పరిజ్ఞానం మానవాళి ఔన్నత్యానికి సేవలందించేలా భరోసా ఇవ్వడమే మా విధానం. డిజిటల్ సహకారం, సామర్థ్య వికాసం, పటిష్ఠ సైబర్ మౌలిక సదుపాయాల కల్పనలో ఉత్తమ విధానాల ఆదానప్రదానం ద్వారా ప్రతి దేశం 'ఏఐ'ని తీర్చిదిద్దుకోవాలన్నది మా నిశ్చితాభిప్రాయం. తదనుగుణంగా ప్రయోజనం పొందగలిగే సార్వత్రిక, విశ్వసనీయ, సమాన అవకాశాలుగల డిజిటల్ ప్రపంచ సృష్టి మా ధ్యేయం. ఇటలీ జీ7 అధ్యక్షతకు, న్యూఢిల్లీలో నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' సత్ఫలితాలకు మూలం ఈ సంయుక్త దృక్పథమే. కృత్రిమ మేధను మానవాళి కోసం.. మానవ మేధ సృష్టించిన ఉపకరణంగా మాత్రమే భావించాలి. అంటే- ఆధునిక సాంకేతికత వ్యక్తులకు స్థానభ్రంశం కలిగించదని లేదా వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగించదని, ప్రజల వాక్స్వాతంత్ర్యాన్ని లేదా ప్రజాస్వామ్య ప్రక్రియలను తారుమారు చేయదని ప్రస్ఫుటం చేయడమే.

# ధైర్య, సాహసాలు బాలికలకు ఆయుధాలు

## - కిశోరి బాలికలకు అవగాహనలో పిడి లక్ష్మి







**సామర్లకోట, (రాజధాని వార్తలు):** బాలికలు ప్రమాద సమయాల్లో మొహమాటాన్ని విడిచిపెట్టి ధైర్య సాహశాలను కూడగట్టుకుని వాటిని ఆయుధంగా చేసుకుని ప్రమాద పరిస్థితుల నుంచి భయట పడాలని మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ అధికారిణి సిహెచ్ లక్ష్మి పిలుపునిచ్చారు. మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ హెల్ప్ లైన్ సంయుక్త ఆధ్వర్యంలో సామర్లకోట బ్రౌన్ పేట జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో కిషోరి బాలికలకు కిషోరి వికాశం, బాలికా చట్టాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి హెచ్ లక్ష్మి మాట్లాడుతూ కిషోరి వికాసం బాల బాలికల సమగ్ర అభివృద్ధి కోసం వేసవి సమావేశాలు కౌమార బాలికలు, కౌమార బాలురకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో మే 1 నుండి జూన్ 11వ తేది వరకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కిషోరి దశలో బాలబాలికలకు సరైన మార్గ దర్శకత్వం, ఆరోగ్య పరిరక్షణ, విద్య మరియు నైపుణ్యాల అభివృద్ధి ఎంతో అవసరమన్నారు. పోక్సో చట్టం 18 సంవత్సరాలు నిండని బాలబాలికలకు రక్షణ కల్పించేందుకు రూపొందించబడిన ప్రత్యేక చట్టమని తెలిపారు. పిల్లలు తమపై జరిగే సురక్షితమైన, అసురక్షితమైన స్పర్శలను గుర్తించగలగాలని, ఏవైనా అనుచిత ఘటనలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ విషయాల్లో ప్రధానంగా బాలికలు ధైర్యంగా ఉండి తమ సమస్యలను నిర్భయంగా వ్యక్తపరచాలని, సమాజంలో ప్రతి ఒక్కరూ బాలల రక్షణకు బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ఎవరైనా మీకు అసౌకర్యంగా అనిపించేలా తాకడం, దగ్గరగా రావడం, అనుచితంగా మాట్లాడడం, ఫోటోలు, వీడియోలు తీసేందుకు ప్రయత్నించడం లేదా చూపించడం చేసినా పరి చయం ఉన్నవారు, బంధువులు, స్నేహితులు లేదా తెలియని వ్యక్తులు అసభ్యకరంగా ప్రవర్తించిన వెంటనే గట్టిగా అరవాలి, ఆ ప్రదేశం నుండి దూరంగా వెళ్ళాలన్నారు. అతి ప్రధానంగా మనకు తెలిసిన వారే 60 శాతం బాలల పట్ల అఘాయిత్యాలకు పాల్పడుతున్నందున అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరి పట్ల అయినా ఏదైనా అనుమానం కలిగితే నమ్మకమైన వ్యక్తులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులుకు చెప్పాలన్నారు.

ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కిషోరి బాలికలకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. బాల్య వివాహాలు బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. ప్రతి బాలికకు విద్య హక్కు ఉందని, చిన్న వయసులో వివాహాలు జరగకుండా సమాజం కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఎవరైనా బాల్యవివాహాలు జరుగు తున్నట్లు తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కు సమాచారం అందించాలని సూచించారు. దీనికి ముందు బాలికల రక్షణ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బ్రౌన్ పేట వీదుల్లో అవగాహన ర్యాలీ పిడి సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఐసీడియస్ సూపర్‌వైజర్ సుల్తాన్ బీబి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయుడు విజయ లక్ష్మి, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ సోషల్ వర్కర్ బి లక్ష్మి, అంగన్వాడీ వర్కర్ యమ్ వి శ్రీలక్ష్మి, ఆశా వర్కర్ నక్కా కుమారి, సి ఆర్పీ వి ప్రిస్కిల్లా, కిషోరి బాలికలు పాల్గొన్నారు.

# జనగణనలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు : ఆర్‌జెడి చంద్రకళ హెచ్చరిక



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలు, నిబంధనలు ప్రకారం జనగణన సర్వేను చేపట్టాలని, ఈ విషయంలో నిర్ల క్ష్యం వహిస్తే సహించేది లేదని మున్సిపల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చంద్రకళ హెచ్చరించారు. సామర్లకోట మున్సిపాలిటీలో జరుగుతున్న జనగణన సర్వేను జనగణన ఆర్జెడి చంద్రకళ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్య ఆధ్వర్యంలో పలు వార్డుల్లో జరుగుతున్న జనాభా లెక్కల సేకరణను రీజినల్ జాయింట్ డైరెక్టర్ చంద్రకళ ఆకస్మికంగా పరిశీలించారు. జనగణన సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, పూర్తిస్థాయిలో ఎన్యుమరేషన్ నిర్వహించాలని ఆమె ఆదేశించారు. సర్వేను వేగవంతం చేయాలన్నారు. పట్టణంలో ఇప్పటివరకు సేకరించిన జనాభా లెక్కల వివరాలు, సిబ్బంది తదితర అంశాలను కమిషనర్ శ్రీవిద్య ఆర్జెడి చంద్రకళకు వివరించారు. సర్వేను వేగవంతం చేసేలా చూడాలని ఆర్జెడి చంద్రకళ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సందర్బంగా ఆర్జెడి మాట్లాడుతూ సామర్లకోట పట్టణంలో జనగణన సర్వే విజయవంతంగా జరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పరిధిలో సామర్లకోట మున్సిపాలిటీలో సర్వే సంతృప్తికరంగా జరుగుతుందన్నారు. జనగణన జిల్లా ఇన్చార్జి ప్రదీప్ జిల్లా మొత్తం మీద జనగణన సర్వేను మానిటరింగ్ చేస్తున్నట్టు తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జనగణన జరుగుతుందన్నారు. రెండో విడతగా 2027 ఫిబ్రవరి నెలలో ఈ సర్వే జరగనున్నట్టు ఆమె తెలిపారు. జనగణన సర్వేకు సూచించిన సర్వే వివరాల్లో సేకరి స్తున్నారా లేదా అనే అంశాలపై పరిశీలన జరిపేం దుకు తాము విచ్చేసినట్టు ఆర్ జె డి చంద్రకళ వివరించారు. ఈ సందర్భంగా జరుగుతున్న జనగణన పై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలు జిల్లా ఇన్చార్జి ప్రదీప్, టి పి ఎస్ మంజుల, జన గణన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే నానాజీ

## - గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి కూటమి ప్రభుత్వం బాధ్యత





**కరప, (రాజధాని వార్తలు):** రైతుల సంక్షేమమే లక్ష్యంగా, రైతుకు ప్రతి ఎకరాకు నీరు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. కరప మండలం పెనుగుదురులో రైతులకు ప్రయోజనం చేకూర్చే ఇరిగేషన్ డ్రైన్స్ పూడికతీత పనులు, గ్రామీణ రహదారి అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రారంభించారు. నిర్వహణ, సంరక్షణ నిధి ద్వారా రూ.7 లక్షల 55 వేల వ్యయంతో సుమారు 1.3 కిలోమీటర్లు నడుకు దురు నుండి పెనుగుదురు మైనర్ డ్రైన్ వరకు చేపట్టిన పూడికతీత పనులకు ఎమ్మెల్యే నానాజీ శంకుస్థాపన చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రూ.8 లక్షల 50 వేల వ్యయంతో సరోజని నగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డ్రైనేజ్ వ్యవస్థ మెరుగుపడటం వల్ల వ్యవసాయ భూములకు ప్రయోజనం కలుగుతుందని, రోడ్ల నిర్మాణంతో ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చిక్కాల రామచంద్రరావు, పెంకే శ్రీనివాస్ బాబా, శిరంగు శ్రీనివాస్, నల్లే ప్రసన్న, ముద్రగడ రమేష్, బండారు మురళి, పీజీ, గొల్లపల్లి చంద్రశేఖర్, తుమ్మలపల్లి గోవింద్, రెడ్డిపల్లి నారాయణరావు, పుణ్యమంతుల అన్నవరం, అను కూల రాంబాబు, జయబాబు, గంటా నానిబాబు, దూడల నారాయుడు, జోకా తాతాజీ, హరనాథ్, సైనవరాపు శంకర్, సింగంపల్లి నాగేశ్వరరావు, మెండు గోవింద్, శాంత, భవాని, ముత్యాలరావు, మాలతి, శివ, రాఖీ, రాజు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పుచ్చలపల్లి 41వ వర్ధంతి కార్యక్రమం

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సీపీఎం పార్టీ వ్యవస్థాపకులు పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సీపీఎం సామర్లకోట పట్టణ కమిటీ ఘనంగా నివాళులు అర్పించింది. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి బాలం శ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, భారత పార్లమెంట్ మొదటి ప్రతిపక్ష నేతగా సుందరయ్య వ్యవహరించారని చెప్పారు. తన యావదాస్తిని ప్రజల కోసం త్యాగం చేశారని, వ్యవసాయ కార్మికులకు మొదటి సంఘం ప్రారంభించారని, పేదల కోసం సహకార దుకాణం నడిపారని చెప్పారు. పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్ళేవారని, సీపీఎం పార్టీ మొదటి కార్యదర్శిగా సుధీర్ఘ కాలం పని చేశారని చెప్పారు. ఆయన ఆశయ సాధనలో కొనసాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, శాఖ కార్యదర్శి కరణం గోవిందరాజు, బాలం హరిబాబు, కరణం సత్యనారాయణ, కొత్తూరి తులసీ దాస్, కరణం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల ఖాతాలో రూ. 24.032 కోట్లు జమ

**- వేట నిషేధ భృతి లబ్ధిదారులకు రూ.20,000 చొప్పున రూ.24.032 కోట్ల నిధులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆనందరావు - కూటమి ప్రభుత్వంలో మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట - మత్స్యకారులకు ఇన్సూరెన్స్, సబ్సిడీపై బోట్లు, వలలు అందిస్తాం**




**అమలాపురం, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి, అభ్యున్నతికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్ వేదికగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో "మత్స్యకారుల సేవలో" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సముద్రంలో వేట సాగిస్తూ జీవనం సాగించే మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో ప్రభుత్వం అందించే "వేట నిషేధ భృతి"ని ఎమ్మెల్యే ఆనందరావు లబ్ధిదారులకు పంపిణీ చేసారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మత్స్యకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల ప్రయోజనాలే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. సముద్రంలో వేట నిషేధించిన కాలంలో మత్స్యకార కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా అర్హులైన 12,016 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 20,000 చొప్పున మొత్తం రూ. 24.032 కోట్లను నేరుగా వారి ఖాతాల్లోకి విడుదల చేయడం జరిగిందన్నారు. మత్స్యకారుల భద్రత, ఉపాధిని మరింత మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం ద్వారా ఇన్సూరెన్స్ (భీమా) సౌకర్యంతో పాటు, సబ్సిడీపై బోట్లు, వలలను అందజేయడం జరుగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వీడి మత్స్యకారుల శ్రమను గుర్తిస్తున్న ఏకైక ప్రభుత్వం మనదేనని స్పష్టం చేస్తూ, అమలాపురం నియోజకవర్గంలోని మత్స్యకార సోదరులందరికీ తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ ఉన్నతాధికారులు, మత్స్యశాఖ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో మత్స్యకార సంఘాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సంక్షేమ బోర్డును ఏర్పాటు కోరుతూ డిసిసిబి చైర్మన్‌కు వినతి

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చెయ్యాలని కోరుతూ పెద్దాపురం శ్రీ కామాక్షి స్వర్ణకార సంక్షేమ సంఘం నాయకులు డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) కు వినతిపత్రం అందజేశారు. స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతి పత్రం డిసిసిబి చైర్మన్‌కు వారు అందజేశారు. ఈ కార్యక్ర మంలో సంఘ గౌరవ అధ్యక్షులు లంక సూర్యనారాయణ, పెద్దాపురం పట్టణం శ్రీ కామక్షి స్వర్ణ కార సంఘం ఆధ్వర్యంలో కాకినాడ డి.సి.సి.బి. బ్యాంక్ చైర్మన్ మరియు కాకినాడ జిల్లా జనసేన నాయకులు తుమ్మల రామస్వామి (బాబు)కి తమ వినతిని అందజేశారు. ఈ సందర్బంగా సంక్షేమ సంఘం సభ్యులు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) స్పందిస్తూ తక్షణమే స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వానికి తెలియజేస్తామని, మీ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తలబత్తుల సాయి, జివి ప్రభాకర్, ధవాళేశ్వరపు సతత్తిబాబు, పి ప్రసాద్, జివి రమణ తదితరులు పాల్గొన్నారు.

# మహేష్ బాబు ఫ్యామిలీ నుంచి మరో బ్యూటీ... జాన్వీ ఫోటోలకు ఫ్యాన్స్ ఫిదా!



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు మేనకోడలు, నటి-దర్శకురాలు మంజుల ఘట్టమనేని కూతురు జాన్వీ స్వరూప్ ఘట్టమనేని గుర్తున్నారా? తాజాగా ఈ యంగ్ బ్యూటీ కార్‌లో దిగిన కొన్ని అందమైన ఫోటోలను ఆమె తల్లి మంజుల సోషల్ మీడియాలో షేర్ చేశారు. లైట్ బ్లూ ట్యాంక్ టాప్, బ్లాక్ కార్గో ప్యాంట్స్‌తో క్యాజువల్ స్ట్రీట్ వేర్ లుక్‌లో జాన్వీ మెరిసిపోతోంది. ఈ ఫోటో షూట్ చూసిన నెటిజన్లు ఘట్టమనేని మూడో తరం వారసురాలు హీరోయిన్ మెటీరియల్ అంటూ తెగ పొగిడేస్తున్నారు. ఆ విశేషాలు చూద్దాం..

**ఘట్టమనేని ఫ్యామిలీ నుండి మరో క్రేజీ ఎంట్రీ:**

తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఘట్టమనేని ఫ్యామిలీకి ఒక ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. లెజెండరీ నటుడు కృష్ణ గారి వారసత్వాన్ని మహేష్ బాబు సూపర్ స్టార్‌గా ముందుకు తీసుకెళుతున్నారు.

ఇప్పుడు అదే ఫ్యామిలీ నుండి మూడో తరం వెండితెరపై సందడి చేయడానికి రెడీ అవుతోంది. ఇప్పటికే రమేష్ బాబు కుమారుడు సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చేసాడు. త్వరలో అతని మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. వారితో పాటే మంజుల కుమార్తె జాన్వీ స్వరూప్ కూడా హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వడానికి గ్రాండ్‌గా ప్లాన్ చేసుకుంటోంది.

**చైల్డ్ ఆర్టిస్ట్‌గా మెప్పించిన జాన్వీ:**

జాన్వీకి కెమెరా ముందేమీ కొత్త కాదు. 2018 లో ఆమె తల్లి మంజుల ఘట్టమనేని దర్శకత్వంలో వచ్చిన 'మనసుకు నచ్చింది' సినిమాలో జాన్వీ ఒక చిన్న పాత్రలో నటించింది. ఇక చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఆ సినిమాలో చాలా క్యూట్‌గా కనిపించి అందరినీ ఆకట్టుకుంది. ఆ తర్వాత ఒక ఫేమస్ జ్యువెలరీ బ్రాండ్‌కు సంబంధించిన యాడ్‌లో కూడా నటించి, అప్పుడే తనలోని గ్లామర్ యాంగిల్‌ను చూపించింది.


**సోషల్ మీడి యాలో వైరల్ అవుతున్న కార్ ఫోటోలు:**

ఇక అసలు విషయానికి వస్తే.. తాజాగా జాన్వీ కార్‌లో ప్రయాణిస్తూ కొన్ని ఫోటోలు దిగింది. ఆ ఫోటోలను మంజుల ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో అవి క్షణాల్లో వైరల్ అయ్యాయి. చాలా సింపుల్‌గా, క్యాజువల్ డ్రస్‌లో ఉన్నా కూడా జాన్వీ లుక్స్ మాత్రం అదిరిపోయాయి. ఇక హీరోయిన్‌కు కావలసిన ఫీచర్స్ అన్నీ ఈ యంగ్ బ్యూటీలో పుష్కలంగా ఉన్నాయంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

**వెండితెరపై లీడ్ హీరోయిన్‌గా రాబోతోంది:**

ప్రస్తుతం జాన్వీ టాలీవుడ్‌లో లీడ్ హీరోయిన్‌గా అడుగుపెట్టడానికి అన్ని రకాలుగా సిద్ధమవుతోంది. నటనలో, డాన్స్‌లో శిక్షణ తీసుకుంటూ తన డెబ్యూ కోసం పక్కాగా ప్లాన్ చేసుకుంటోంది. ఘట్టమనేని ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ఎలాగూ ఉంది, దానికి తోడు ఈమె గ్లామర్ కూడా తోడైతే టాలీవుడ్‌లో మరో స్టార్ హీరోయిన్ అవ్వడం ఖాయం అనిపిస్తోంది. మొత్తానికి మహేష్ బాబు మేనకోడలు జాన్వీ స్వరూప్ ఘట్టమనేని తన లేటెస్ట్ ఫోటో షూట్‌తో సోషల్ మీడియాలో మంచి హడావిడి చేస్తోంది. చైల్డ్ ఆర్టిస్ట్‌గా గుర్తున్న ఆ చిన్నారి, ఇప్పుడు హీరోయిన్ స్థాయిలో మెరిసిపోతుండటంతో అందరూ ఆశ్చర్యానికి గురవుతున్నారు.

# లెహంగా సోయగాలతో మైమరపిస్తున్న నభా నటేష్!



ఇటు తమ అందాలను ఆరబోయడమే కాకుండా అటు తమ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను కూడా చేపడుతూ సోషల్ మీడియాలో మరింత బిజీ అయిపోయారు సెలబ్రిటీలు. ఒకరి తర్వాత ఒకరు తమ అందాలను ఆరబోయడమే కాకుండా.. ఒకరిని మించి మరొకరు గ్లామర్ డోస్ పెంచి మరీ కుర్ర కారుకు నిద్ర లేకుండా చేస్తున్నారు. అలాంటి వారిలో నభా నటేష్ కూడా ఒకరు. అందం, అభినయంతో, నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న ఈ ముద్దుగుమ్మ.. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో మరింత యాక్టివ్ అయిపోయింది. రోజుకొక ట్రెండీ అవుట్ ఫిట్‌తో దర్శనమిస్తూ గ్లామర్ వలకబోస్తూ కుర్రాళ్ల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. అందులో భాగంగానే తాజాగా మరోసారి లెహంగా అందాలతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేయడానికి సిద్ధం అయిపోయింది ఈ ముద్దుగుమ్మ. సియా ఫ్యాషన్ బొటిక్ డిజైన్ చేసిన ఆరెంజ్ కలర్ లెహంగా ధరించి తన అందాలతో మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా మనోజ్ఞ గొల్లపూడి స్టైలింగ్‌తో తన లుక్‌ను మరింత పర్ఫెక్ట్‌గా మార్చుకుంది. ప్రముఖ ఫోటోగ్రాఫర్ సందీప్ క్లిక్ మనిపించిన ఈ ఫోటోలలో మరింత అందంగా కనిపిస్తోందని చెప్పవచ్చు. హెవీ బ్యాంగిల్స్ ధరించిన ఈమె.. చెవి దిద్దులతో పాటు దానికి కాంబినేషన్లో సింపుల్ నెక్ చౌకర్ ను ధరించి ఆకట్టుకుంటుంది. మొత్తానికైతే కాటుక కళ్ళతో ఆకట్టుకున్న ఈమె లెహంగా సోయగాలతో ప్రేక్షకులను అలరించడమే కాకుండా "పురాణం.. అద్భుతాలతో నిండిన కథ" అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. ఇక ప్రస్తుతం నభా షేర్ చేసిన ఈ లెహంగా గ్లామర్ పిక్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. చిక్ మంగళూరు జిల్లాకి చెందిన నభా నటేష్ బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్ పూర్తి చేసి మోడల్‌గా తన కెరీర్‌ను మొదలుపెట్టింది. 2015లో శివరాజ్ కుమార్‌తో కలిసి వజ్రకాయ అనే కన్నడ చిత్రం ద్వారా నటిగా అరంగేట్రం చేసిన ఈమె.. తెలుగులో మాత్రం నన్ను దోచుకుందువటే అనే చిత్రం ద్వారా ప్రేక్షకులను పలకరించింది. ఆర్ఎస్ నాయుడు దర్శకత్వంలో సుధీర్ బాబు హీరోగా నటించిన ఈ సినిమాలో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇకపోతే ఈమెకు మంచి గుర్తింపును అందించిన చిత్రం మాత్రం ఇస్మార్ట్ శంకర్. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ పోతినేని హీరోగా నటించిన ఈ సినిమాలో ఈమెతో పాటు నిధి అగర్వాల్ కూడా మరో హీరోయిన్గా నటించి మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. చివరిగా డార్లింగ్ సినిమాతో ప్రేక్షకులను పలకరించిన ఈమె తాజాగా నిఖిల్‌తో స్వయంభు, విరాట్ కర్ణతో నాగబంధం, అలాగే టైసన్ నాయుడు అనే చిత్రాలలో నటిస్తోంది. ముఖ్యంగా స్వయంభు సినిమా పీరియడ్ యాక్షన్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు త్వరలో రానుండగా.. అటు అభిషేక్ నామా దర్శకత్వంలో వస్తున్న నాగబంధం సినిమా కూడా ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే టైసన్ నాయుడు సినిమాలో కూడా నటిస్తోంది. ఏదేమైనా వరుస పాన్ ఇండియా చిత్రాలలో నటిస్తూ పాన్ ఇండియా వైడ్ గుర్తింపు తెచ్చుకోవాలని ప్రయత్నం చేస్తోంది ఈ ముద్దుగుమ్మ.

# ఒకే స్టేజ్ పై పవన్- చిరూ..



మెగాస్టార్ చిరంజీవి హీరోగా డైరెక్టర్ బాబీ కొల్లి తెరకెక్కించనున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ #Mega158 పై అఫీషియల్ హడావిడి మొదలైంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొనగా, ఇప్పుడు మ్యూజిక్ డైరెక్టర్ గా తమన్ పేరు ఖరారు కావడంతో సినిమాపై మరింత హైప్ ఏర్పడింది. మే 21న ఈ సినిమాకు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ముఖ్య అతిథిగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హాజరవుతుండటంతో ఈ వేడుకపై అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. మెగాస్టార్- పవర్ స్టార్ ఒకే వేదికపై కనిపించబోతుండటంతో సోషల్ మీడియాలో ఆల్రెడీ భారీ డిస్కషన్ మొదలైంది. ఇక మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ ప్రాజెక్ట్‌లో భాగమవడం ఇండస్ట్రీ వర్గాల్లో ప్రత్యేక చర్చకు దారితీస్తోంది. గతంలో చిరంజీవి నటించిన గాడ్ ఫాదర్ సినిమాకు తమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మాస్ ఎలివేషన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇప్పుడు మరోసారి మెగాస్టార్ సినిమాకి ఆయన సంగీతం అందించబోతుండటంతో అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. మరోవైపు డైరెక్టర్ బాబీతో తమన్‌కు ఇప్పటికే బలమైన సక్సెస్ ట్రాక్ ఉంది. వెంకీ మామ, డాకు మహారాజ్ లాంటి సినిమాల్లో వీరి కాంబినేషన్ మంచి ఫలితాలను అందుకుంది. ముఖ్యంగా మాస్ బీట్‌లు, ఎమోషనల్ స్కోర్, హీరో ఎలివేషన్ మ్యూజిక్ విషయంలో తమన్- బాబీ కాంబోకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అదే మ్యాజిక్ ఇప్పుడు మెగా158లో మరింత భారీ స్థాయిలో కనిపించబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఇండస్ట్రీ సమాచారం ప్రకారం ఈ సినిమా పూర్తి స్థాయి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనుంది. చిరంజీవి ఇమేజ్‌కు తగ్గట్టుగా పవర్‌ఫుల్ కథ, హై వోల్టేజ్ యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్, కమర్షియల్ ఎలిమెంట్స్ మేళవింపుతో బాబీ స్క్రిప్ట్ ను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. వాల్తేరు వీరయ్య తర్వాత చిరంజీవి- బాబీ కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో ఏర్పడిన నమ్మకం ఈ ప్రాజెక్ట్‌కు మరింత బలం చేకూరుస్తోంది. ఇక కెవిఎన్ ప్రొడక్షన్స్ నిర్మాణంలో ఈ సినిమా భారీ బడ్జెట్‌తో రూపొందనున్నట్లు సమాచారం. పూజా కార్యక్రమాల తర్వాత షూటింగ్ షెడ్యూల్‌పై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశముంది.

మరోవైపు తమన్ ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్ ప్రారంభించినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. మెగాస్టార్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు తగ్గ మాస్ బీజీఎం, ఫ్యాన్స్‌కు థియేటర్లలో ఊపు తెప్పించే పాటలు ఈ సినిమాలో ప్రధాన ఆకర్షణగా నిలవొచ్చని భావిస్తున్నారు. దీంతో #Mega158 టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రాజెక్ట్‌లలో ఒకటిగా మారింది.

# పెద్ది కోసం అన్నీ పక్కన పెట్టిన రెహమాన్



పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొన్న పెద్ది సినిమాపై ఇప్పుడు మరోసారి ఇండస్ట్రీ దృష్టి పడేలా చేసిన పేరు ఏఆర్ రెహమాన్. ఈ సినిమా నుంచి ఆల్రెడీ రిలీజైన సాంగ్స్ సోషల్ మీడియాలో చార్ట్‌బస్టర్‌గా మారగా, ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వర్క్ గురించి వస్తున్న అప్డేట్స్ టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా రెహమాన్ ఇతర ప్రాజెక్ట్స్‌ను పక్కన పెట్టి పూర్తిగా పెద్ది మీదే ఫోకస్ పెట్టారన్న వార్తలు ఫ్యాన్స్‌లో మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, ఫస్ట్ హాఫ్‌కు సంబంధించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను ఇప్పటికే టీమ్‌కు అందించిన రెహమాన్ ప్రస్తుతం సెకండ్ హాఫ్ స్కోర్ కోసం ప్రత్యేకంగా పని చేస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఒకేసారి పలువురు డైరెక్టర్లతో బిజీగా ఉండే రెహమాన్, ఈసారి మాత్రం పెద్ది కోసం ఎక్కువ సమయం కేటాయించడం విశేషంగా మారింది. అన్నింటికంటే ఇంట్రెస్టింగ్ అంశం ఏమిటంటే, చాలా ఏళ్ల తర్వాత ఒక స్ట్రెయిట్ తెలుగు సినిమాపై రెహమాన్ ఈ రేంజ్ ఎగ్జైట్‌మెంట్ చూపిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. పెద్దికి మంచి మ్యూజిక్ ఇచ్చి, తద్వారా మరింత బిజీ అవాలని ఆయన ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. దానికి తోడు డైరెక్టర్ బుచ్చిబాబు సాన చెప్పిన కథ, గ్రామీణ నేపథ్యంతో కూడిన స్పోర్ట్స్ డ్రామా ఎమోషన్స్ రెహమాన్‌ను బాగా ఆకట్టుకున్నాయని సమాచారం. కథ విన్న వెంటనే ఈ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పిన ఆయన, సినిమా టోన్‌కు తగ్గట్టుగా సంగీతాన్ని డిజైన్ చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విషయంలో ఆయన తీసుకుంటున్న కేరింగ్ టీమ్‌ను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తోందని చెబుతున్నారు. రీసెంట్‌గా ముంబైలో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కూడా రెహమాన్ సినిమా గురించి ఎంతో కాన్ఫిడెంట్‌గా మాట్లాడారు. ట్రైలర్‌కు వచ్చిన రెస్పాన్స్, సోషల్ మీడియాలో కొనసాగుతున్న ట్రెండింగ్ కూడా ఇప్పుడు సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. ఇప్పటికే విడుదలైన సాంగ్స్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రావడంతో, త్వరలో రిలీజ్ కానున్న ఐటమ్ సాంగ్‌పై కూడా భారీ హైప్ నెలకొంది. మరోవైపు రామ్ చరణ్ కెరీర్‌లో పెద్ది మ్యూజిక్ ఓ ప్రత్యేక మైలురాయిగా నిలిచే అవకాశముందని అభిమానులు భావిస్తున్నారు. స్పోర్ట్స్ డ్రామాల్లో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఎంత కీలకమో గతంలో అనేక సినిమాలు నిరూపించగా, ఇప్పుడదే మ్యాజిక్‌ను రెహమాన్ పెద్దిలో చూపించబోతున్నారనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా గ్రామీణ భావోద్వేగాలు, మాస్ ఎలిమెంట్స్, స్పోర్ట్స్ హై ఇంటెన్సిటీ సన్నివేశాలకు ఆయన ఇచ్చే సంగీతం నెక్స్ట్ లెవల్‌లో ఉంటుందని అందరూ భావిస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో శృతి హాసన్ స్పెషల్ సాంగ్ చేయగా, ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జూన్ 4వ తేదీన పెద్ది ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# సేవాతత్పరతకు ప్రతీకలు - సమాజ సేవలో అగ్రగాములు ఆర్యవైశ్యులు



**విజయనగరం, (రాజధాని వార్తలు):** న్యాయబద్ధమైన వ్యాపారం మార్గంగా ఎంచుకొని సేవాతత్పరతకు ప్రతీకలుగా సమాజ సేవలో అగ్రగాములుగా ఆర్యవైశ్యులు ఉన్నారని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పేర్కొన్నారు .ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ విజయనగరం జిల్లా మహిళా విభాగ ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ న్యాయమైన వ్యాపారంతో సంపదను సృష్టించి, ఆ సంపదను సమాజ శ్రేయస్సు కోసం అన్నదానాలు, విద్యాదానాల రూపంలో తిరిగి ఇచ్చే గొప్ప గుణం ఒక్క ఆర్యవైశ్యులకే సొంతం అని ఎక్కడ ఆకలి కేకలు వినిపించినా, అక్కడ 'అన్నసత్రం' ఏర్పాటు చేసి ఆకలి తీర్చే కరుణామయులు ఆర్యవైశ్యులని. వారి సేవాతత్పరత సమాజానికి నిరంతర వెలుగు అని అభివర్ణించారు .ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కే జయశ్రీ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనం చేసి మాట్లాడుతూ "ధర్మ రక్షణ కోసం, ఆత్మగౌరవం కోసం అగ్ని ప్రవేశం చేసిన అమర మాత శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి వారసులుగా సమాజ హితమే తమ హితంగా భావించే వారే ఆర్యవైశ్యులు అని అన్నారు. జిల్లా మహిళా విభాగం అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన సముద్రాల గిరిజ ప్రసన్న మాట్లాడుతూ శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అడుగుజాడల్లో నడుస్తూ... శాంతి, అహింస, సత్యం మరియు సన్మార్గాన్ని తమ జీవిత విధానంగా మార్చుకున్న ధన్యజీవులు ఆర్యవైశ్యులు అని, మాటలో మర్యాద, చేతలో నిజాయితీ, వ్యాపారంలో నైపుణ్యం చూపిస్తూ... దేశ ఆర్థిక ప్రగతికి తమదైన శైలిలో వెన్నుముకగా నిలిచే శ్రమజీవులు ఆర్య వైశ్యులు అని పేర్కొన్నారు .ముందుగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణితో కలిసి జయశ్రీ మహిళా విభాగంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షురాలుగా సముద్రాల గిరిజా ప్రసన్న, కార్యదర్శిగా సంధ్య భారతి, కోశాధికారిగా గుడిస దివ్య, యువజన విభాగం అధ్యక్షులుగా వి కిరణ్ కుమార్, కార్యదర్శిగా కే సాయి కిషోర్, కోశాధికారిగా గ్రంధి కుమార్ రాజా బాధ్యతలు స్వీకరించారు. అధికార ప్రతినిధి ఉప్పల ఈశ్వరరావు నేతృత్వంలో ,జిల్లా సంఘం అధ్యక్ష కార్యదర్శులు బోండా రమేష్, గుడిసె బాలకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా సంఘం జిల్లా శాఖ ప్రధాన సలహాదాజిల్లా శాఖ ప్రధాన సలహాదారు సముద్రాల గురు ప్రసాద్ వ్యవహరించారు. ఈ సమావేశంలో సంఘం ఉత్తరాంధ్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పలుకూరి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

# వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియ వేగవంతం చెయ్యండి

## - తిరస్కరణ మ్యుటేషన్లకు గ్రామసభలో కారణాలు వివరించాలి : జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సేదు మాధవన్



**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలకు చేపట్టిన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సేదు మాధవన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాజెక్టులు కు భూసేకరణకు సంబంధించి కలెక్టరేట్ నుండి మంగళ వారం వర్చువల్ గా సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ సంబంధించిన ఇంకనూ సమకూర్చవలసిన భూ సేకరణపై సమీక్షించారు. ట్రైబల్ యూనివర్సిటీకి విద్యుత్ స్థాపన ఏర్పాట్లు పై సూచిస్తూ ఆ ప్రాంతంలో ఉన్న ఎలక్ట్రికల్ టవర్లు తక్షణం తీయవలసిన అవసరముందని అదేవిధంగా కొత్తగా హెచ్‌టి లైన్లు వేయుటకు అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. భూసేకరణ అనంతరం ఆర్థిక అనుమతులు వచ్చిన వెంటనే బిల్స్ అప్లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. తారకరామ తీర్థసాగర్, తోటపల్లి ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, మూడో రైల్వే లైన్, కొత్తవలస-విజయనగరం నాలుగో రైల్వేలైన్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తదితర ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్షించారు. ప్రాజెక్టుల వారీగా పనుల ప్రస్తుత పరిస్థితిని సమీక్ష చేశారు. శాఖాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తర్వాతే బడ్జెట్ అంచనా వేయాలన్నారు. వివిధ దశలలో గల భూ సేకరణ ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తిచేసి, ప్రాజెక్టులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. జాతీయ రహదార్ల విస్తరణ నిమిత్తం సుమారు ఎనభై ఎకరాలకు రెవిన్యూ శాఖ అనుమతులు, అదేవిధంగా స్ట్రక్చర్ల అంచనాలకు ఆర్ అండ్ బి శాఖ అధికారులు ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించారు. సంబంధిత భూ లావాదేవీలలో కోర్టులో ఉన్న కేసుల పరిష్కారానికి కృషి చేయాలని రెవిన్యూ అధికారులను కోరారు. భూ సేకరణ పూర్తయిన వాటికి బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలని తెలిపారు. అవార్డ్‌కు సిద్ధంగా ఉన్నవాటికి అవార్డ్స్ పాస్ చేయాలన్నారు. భూసేకరణ పనులన్నింటికి ప్రాధాన్యత నిచ్చి పూర్తి చేయాలన్నారు.

**- తిరస్కరణ మ్యుటేషన్లకు గ్రామసభలో కారణాలు వివరించాలి**

జిల్లాలో పెండింగ్ మ్యుటేషన్లను వెంటనే పరిష్కరించాలని ఇంచార్జ్ కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, సర్వేయర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో తిరస్కరణలకు గురైన మ్యుటేషన్లు కోసం గ్రామసభలు పెట్టి తిరస్కరణకు గల కారణాలను వివరించాలని అన్నారు. వంగర, చీపురుపల్లి, భోగాపురం, డెంకాడ, కొత్తవలస, గంట్యాడ మండలాల తహసీల్దార్లతో మాట్లాడుతూ ఎక్కువ మొత్తంలో మ్యుటేషన్లు పెండింగుకు గల కారణాలు అడుగుతూ తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కరించిన మ్యుటేషన్లను సకాలంలో డిస్పోజల్ చేయాలని అన్నారు. ఇకనుండి ప్రతి రోజూ సమీక్ష నిర్వహించబడుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ సత్తిబాబు, ఆర్డీవోలు సుధాసాగర్, రామ్మోహన్, సుధారాణి, సర్వే ఎడి, తహశీల్దార్లు, సర్వేయర్లు, ఇరిగేషన్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

# గంజాయి నియంత్రణలో భాగంగా తనిఖీలు

## - డిఎస్పి ఆర్.గోవిందరావు, సి.ఐ ఎస్.సన్యాసినాయుడు









**గజపతినగరం, (రాజధాని వార్తలు):** జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు బొబ్బిలి డిఎస్పి ఆర్ గోవిందరావు ఆధ్వర్యంలో గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.సన్యాసినాయుడు పర్యవేక్షణలో మంగళవారం నాడు తనిఖీలు చేపట్టినట్లు గజపతినగరం ఎస్సై కె.కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు. ఈ తనిఖీలలో భాగంగా రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో డిఎస్పి ఆర్.గోవిందరావు, సి.ఐ ఎస్.సన్యాసినాయుడు, సర్కిల్ సబ్ ఇన్స్పెక్టర్లు గజపతినగరం ఎస్.ఐ కె కిరణ్ కుమార్ నాయుడు, బొండపల్లి సబ్ ఇన్స్పెక్టర్ యు.మహేష్, ఆంధ్ర ఎస్సై సీతారాం, స్టేషన్ బూర్జవలస ఎస్.ఐ రాజేష్, 60 మంది పోలీస్ సిబ్బందితో గంజాయి నియంత్రణలో భాగంగా ట్రైన్‌లో తనిఖీలు చేపట్టడం జరిగిందని గజపతినగరం ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు. ఎవరైనా ట్రైన్లలో గంజాయి రవాణా చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిఎస్పి ఆర్.గోవిందరావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. సన్యాసినాయుడు హెచ్చరించారు. ఎవరైనా గంజాయి విక్రయించిన, కొనుగోలు-అమ్మకాలు చేసిన అటువంటి వారికి కఠినమైన జైలు శిక్షలు పడతాయని వారిరువురూ హెచ్చరించారు. గంజాయికి బానిసలై యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని డిఎస్పి, సర్కిల్ ఇన్స్పెక్టర్, సబ్ ఇన్స్పెక్టర్లు యువతకు సూచనలు చేశారు.

ఈ గంజాయి తనిఖీలలో ఈగల్ టీం, డాగ్ స్క్వాడ్, జిఆర్పి బృందాలు పాల్గొనడం జరిగిందని గజపతినగరం ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు అన్నారు.

# కిషోరి వికాసం కార్యక్రమం





**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట మండలం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని డి.మల్లవరం అంగన్వాడీ కేంద్రం నందు చైల్డ్ ఫౌండ్ - రాస్, ఐసిడిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో కిషోరి వికాశం కార్యక్ర మం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేణి గుంట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ. కె.కృష్ణవేణి, సూపెర్వైసర్ పి.హేమావతి, అంగన్వాడీ కార్యకర్త గీత మరియు కిషోరి బాలికల, తల్లులు పాల్గొన్నారు. సిడిపిఓ కృష్ణవేణి మాట్లా డుతూ కిషోరి బాలికల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేసవి సెలవుల్లో కిషోరి వికాసం కార్యక్రమం అమలు చేయడం జరిగింది అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పిల్లలకి విద్య యొక్క ప్రాము ఖ్యత, పోక్సో చట్టం, ఆర్థిక సాధికారత, బాల్య వివాహం, పోషకా హారం, పరిశుభ్రత, జీవన నైపుణ్యాలు మొదలగు అంశాలపై దసలవారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని తెలియజేసారు. సెలవుల్లో ఈ అవకాశాన్ని పిల్లలు ఉపయో గించుకొని సమావేశాలకు హాజరై సమాచారాన్ని తెలుసుకొని గ్రామంలోని అందరి కిషోరి బాలబాలికలకు వివరించాలని తెలియజేసారు. ప్రతి మంగళవారం కూడా గ్రామ స్థాయిలో కిషోరి బాలబాలికలకు సమావేశం ఏర్పాటు చేసి ఒక్కో అంశం పైన వివరంగా శిక్షణ అందించడం జరుగుతుందని తెలియ జేసారు.

# బాలల హక్కులు చట్టాలపై అవగాహన కల్పించిన ఎస్సై వెంకటరమణ

**మక్కువ, (రాజధాని వార్తలు):** మంగళవారం నాడు మండలంలో గల మూలకవలస, మక్కువ, శంబర, కవిరిపల్లి, డిసిర్లం గ్రామాలలో కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా ఎస్సై వెంకటరమణ పాల్గొని బాలికలకు బాల్యవివాహాలు నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. అలాగే గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. బాలల రక్షణ విద్య హక్కు వంటి ప్రాముఖ్యత గురించి సవివరంగా విద్యార్థులతో మాట్లాడుతూ చెప్పారు. అలాగే ఎవరికి ఏ విధమైన కష్టం కలిగిన తమను వెంటనే సంప్రదించాలని చట్టపరంగా తగు చర్యలు తీసుకొని వారిని రక్షిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




# గంగమ్మ ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

## - అమ్మవారిని దర్శించుకున్న జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్

**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ చెప్పారు. మంగళ వారం శ్రీ తాతయ్యగుంట గంగమ్మ అమ్మవారిని మంత్రి దర్శిం చుకున్నారు. అంతకు మునుపు ఆయన ఆలయం వద్దకు రాగానే ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, పాలకమండలి సభ్యులు, ఈవో జయకుమార్ పురోహితులు వేదమంత్రోచ్ఛారణల మధ్య పూర్ణకుంభముతో స్వాగతం పలికి అమ్మవారి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం మంత్రితోపాటు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్‌లకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసా దాలను అందజేశారు. మంత్రి సత్యప్రసాద్‌కు గంగమ్మ తల్లి చిత్రపటాన్ని బహుకరించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతర ఉత్సవాలకు హాజరు కావాల్సి ఉండేదని, రాలేకపోవడం వల్ల ఇప్పుడు అమ్మ వారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. చైర్మన్



మహేష్ యాదవ్ నేతృత్వంలో ఆలయం అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతోందని, ఇంకా అభివృద్ధికి కావలసిన పూర్తి సహాయ సహకారాలను ప్రభుత్వము నుండి అందజేస్తామన్నారు. అమ్మవారి జాతర ఉత్సవాలను కనివిని ఎరుగని రీతిలో అంగరంగ వైభవంగా రాష్ట్ర ప్రభుత్వము సహకారంతో బాగా నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# విధ్వంస పాలనను కప్పిపుచ్చుకునేందుకు మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య అబద్ధపు ప్రచారాలు

## - ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ





**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల పాలనలో సృష్టించిన విధ్వంస పాలనను కప్పిపుచ్చుకునేందుకు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. మీ విధ్వంస పాలనను మరిచారా సంజీవయ్యా అంటూ ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి, ఇసుక దోపిడీతో భవన నిర్మాణ కార్మికుల పొట్టగొట్టిన చరిత్ర వారిదని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. ప్రజల చేత ఘోరంగా తిరస్కరించబడిన వైఎస్సార్‌సీపీ నేతలు, మాజీ ఎమ్మెల్యే కలివేటి సంజీవయ్య ఉనికి కోసమే కూటమి ప్రభుత్వంపై అవాస్తవాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో పేద ప్రజల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యాన్ని అడ్డగోలుగా నల్లబజారుకు తరలించారని ఆరోపించారు. కాకినాడ పోర్టు కేంద్రంగా రాష్ట్రవ్యాప్తంగా సాగిన 'రేషన్ మాఫియా' వెనుక ఎవరి హస్తం ఉందో.. ఎవరెవరు వైసీపీ పెద్దల జేబుల్లోకి కోట్లాది రూపాయల అక్రమ సంపాదన వెళ్ళిందో ప్రజలందరికీ తెలుసు అన్నారు. ఎండీయూ వాహనాల పేరుతో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడి, రేషన్ పంపిణీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. తమ కూటమి ప్రభుత్వం రాగానే రేషన్ మాఫియా గుట్టురట్టు చేసి, పేదలకు అందాల్సిన ప్రతి బియ్యపు గింజనూ పారదర్శకంగా ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సూళ్లూరుపేట నియోజకవర్గంలో రోడ్లు గుంతలమయమై, కనీస మౌలిక సదుపాయాలు కరువై అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే పెండింగ్ ప్రాజెక్టులను పరుగులు పెట్టిస్తున్నామని తెలియజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్ల పునర్నిర్మాణం, తాగు నీరు, సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. పరిశ్రమలకు కేరాఫ్ అడ్రస్ అయిన మన ప్రాంతంలో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను, కొత్త పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా పాలన అందిస్తుందని తెలియజేశారు. తమ ప్రభుత్వానికి వ్యవస్థలను నిర్మించడం, ప్రజలకు రక్షణ కల్పించడం బాగా తెలుసన్నారు. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో రాష్ట్రంలో 'గుండా రాజ్యం నడిచిందని, చట్టాన్ని చుట్టాలుగా మార్చుకుని ప్రతిపక్షాలపై దాడులు చేసి, భయానక వాతావరణం సృష్టించిన వైసీపీ నేతలు నేడు నిబంధనల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో సొంత బ్రాండ్ల పేరుతో నాసిరకం, కల్తీ లిక్కర్ అమ్మి సామాన్య ప్రజల ప్రాణాలను బలి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్ర యువత భవిష్యత్తును నాశనం చేస్తూ డ్రగ్స్, గంజాయి సంస్కృతిని విస్తరించింది వైసీపీ నేతలేనని తెలిపారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కల్తీ మద్యం, డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం మోపామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా పన్నులు బాది దేశంలోనే అత్యధికంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఉన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టిందని తెలియజేశారు. రవాణా రంగాన్ని కుదేలు చేసి, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమైన వైసీపీ నాయకులు ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని మాట్లాడుతున్నారని విమర్శించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కేవలం 'కుటుంబ రాజకీయాలు, సొంత లాభాల కోసమే పరిపాలన సాగించారు తప్ప సామాన్య కార్యకర్తలను, ప్రజలను పట్టించుకోలేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని కుటుంబ జాగీరుగా మార్చిన చరిత్ర (వైసీపీ) మీదే అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ తుగ్లక్ ఇసుక విధానాల వల్ల భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయి, ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితి దేశమంతా చూసిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే పారదర్శక విధానంతో చౌకగా ఇసుకను సామాన్యులకు, భవన నిర్మాణ కార్మికులకు అందుబాటులోకి తెచ్చి, కార్మిక రంగానికి నిజమైన ఊతం ఇచ్చిందని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో 'జె-ట్యాక్స్' వేధింపులు భరించలేక ఎన్నో ప్రతిష్టాత్మక పరిశ్రమలు రాష్ట్రం వదిలి పారిపోయిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలకు పూర్తి భరోసా కల్పిస్తున్నామని, పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో అనుమతులతో వేగంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు.

గత ఐదేళ్ల మీ (వైసీపీ) విధ్వంసకర, ప్రతీకార పాలనను చూసి విసిగిపోయిన ప్రజలు మిమ్మల్ని పాతాళానికి తొక్కేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న ఆదరణను తట్టుకోలేకనే మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య ఇటువంటి అబద్ధపు ప్రచారాలకు తెరలేపారని వివరించారు. వారి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆందోళనలు ఆపి, ఇకనైనా మీరు ప్రశాంతంగా విశ్రాంతి (రెస్ట్) తీసుకుని, మీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోండని హితవు పలికారు. ప్రజలు తమకు స్పష్టమైన తీర్పు ఇచ్చారని ఈ రాష్ట్రాన్ని, సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని ఎలా చక్కగా పాలించాలో తమ కూటమి ప్రభుత్వానికి బాగా తెలుసన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ వివరించారు. ఈ కార్యక్రమంలో నాయుడు పేట తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, ఓజిలి మండలం టిడిపి అధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, సూళ్లూరు పేట ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, తిరుమూరు సుధాకర్ రెడ్డి, రమేష్ నాయుడు, పలువురు తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# భూ కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలి

## - ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రామానాయుడు




**గూడూరు, (రాజధాని వార్తలు):** క్రిస్ సిటీలోను జరిగిన భూ కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు. ఏ రామానాయుడు చేశారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ సిటీ పేరుతో 1300 ఎకరాలు భూమిని సేకరిస్తున్నారు అన్నారు. కటిక దరిద్రులు, పేదలు ఎకరా, అర ఎకరా, భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, అవి కూడా వర్షాధార పంటలు తప్ప, వేరే పంటలు వేయలేదు అన్నారు. ఆ భూముల్లో జీడి మామిడి, జామ్ ఆయిల్, సవక, కొద్దిగా వేరుశనగ పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ పొలాలలో వందల సంఖ్యలో తాటి చెట్లు కూడా ఉన్నాయని, వాటిని గీత కార్మికులు కల్లు గీసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. చిల్లకూరు మండలములోని పల్లె వారి దిబ్బ, తీగలపాలెం, తమ్మిన పట్నం ఈ గ్రామాల్లో 700 వందల కుటుంబాలు తాటి చెట్లు గీసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రభు త్వం 400 ఎకరాలకే భూ పరిహారం చెల్లించాలన్నారు. మిగతా 500 ఎకరాలకు ఇప్పటి వరకు రూపాయి కూడా చెల్లించలేదన్నారు. గ్రామస్థులు తిరుపతి జిల్లాలో ఉన్నపుడు తిరుపతి జిల్లా కలెక్టర్‌కి, చిల్లకూరు తహసీల్దార్, గూడూరు ఆర్డీవోకి వినతి పత్రాలు ఇచ్చారన్నారు. జాయింట్ కలెక్టర్ నేరుగా భూములను పరిశీలించి అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని ఇప్పటి వరకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. తమ్మినపట్నం గ్రామంలోని 291 సర్వే నెంబర్‌లో 128 ఎకరాలు భూమి ఉంటే 60 ఎకరాల భూమి అనామత్తుగా ఉందని, గ్రామస్తులది కాదని అధికారులు తేల్చేశారు అన్నారు. ఈ 60 ఎకరాల భూమికి బదులు మైనింగ్ డాన్‌కి మరొకచోట సిలికా భూములను ఇవ్వాలని ప్రతిపాదన చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈ 60 ఎకరాల భూమి ఎవరిది, ఆయన పేరు ఏమి, ఆకాశంలో ఉన్నాడా, భూమి లోపల ఉన్నడా, గ్రామంలో లేని వ్యక్తిని ఈ భూములు అప్పగించడం ఎంతవరకు సమంజసం, ఆ మైనింగ్ డాన్ పేరును బహిర్గతం చేయాలని అధికారులకు సవాలు విసిరారు. ఇదే నిజమైతే ఆ మైనింగ్ డాన్‌కు భూమికి బదులు భూమిని ఇస్తున్నపుడు, 1300 ఎకరాల పేదలకు భూమికి బదులు భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2013 భూ సేకరణ యాక్ట్ ప్రకారం ప్రభుత్వ అవసరానికి భూసేకరణ చేయాలంటే గ్రామ సభలు జరిపి ప్రజల ఆమోదం తీసుకోవాలని తెలిపారు. ఈ 500 వందల ఎకరాల భూమికి పరిహారం ఇవ్వకుండా పేదల మధ్య తగాదాలు పెట్టీ కాలయాపన చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఇకనైనా పేద రైతులకు న్యాయం చేయాలన్నారు. అధికార పార్టీ కనుసైగల్లో అధికారులు భూ కుంభకోణం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సిలికా భూ కుంభకోణాన్ని బహిర్గతం చేయమని చిల్లకూరు తహసీల్దార్, గూడూరు ఆర్డీవోని కోరుతున్నామన్నారు. భవిష్యత్‌లో ప్రజలను సమీకరించి ప్రజా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సి హెచ్.ప్రభాకర్, నెల్లూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు షేక్ షాన్‌వాజ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్, ఏ.ఐ.టి.యు.సి జిల్లా అధ్యక్షులు కొమ్మి నారాయణ, ఏ.ఐ.ఎస్.ఎఫ్ నాయకులు రిజ్వాన్, తదితరులు పాల్గొనారు.

# ఎన్టీఆర్ నగర్ గంగమ్మ జాతరలో బియ్యపు శ్రీవాణి రెడ్డి





**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ గంగమ్మ జాతర మహోత్సవ శుభ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణి రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఎన్టీఆర్ నగర్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు బియ్యపు శ్రీవాణి రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం వినాయకుని దేవాలయం నుండి అమ్మవారి సారెను తీసుకొని ఊరేగింపుగా వెళ్లి గంగమ్మ తల్లికి సమర్పించారు. దర్శనానంతరం ఆమెకు ఆలయ నిర్వాహకులు ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గంగమ్మ తల్లి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు శివకుమార్ యాదవ్, పఠాన్ ఫరీద్, మున్నా రాయల్, యోగ, బావాజీ, సురేష్, గాంధీ, జీవీకే రెడ్డి, ప్రవీణ్, తరుణ్, అభిషేక్, మోహన్, సూర్య, కల్లి, సమీర్, బాలాజీ రెడ్డి, రెడ్డి భాష, శివ, చెంచయ్య, శీన, భాను తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు సిపిఎం కార్యదర్శి డేవిడ్ రాజు ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నివాళులు



**ఆత్మకూరు, (రాజధాని వార్తలు):** కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా ఆత్మకూరు పట్టణంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు సమర్పించారు. ఆత్మకూరు సిపిఎం పార్టీ కార్యదర్శి డేవిడ్ రాజు ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం మరియు పట్టణంలోని బిఎస్ఆర్ సెంటర్‌లో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. మొదట సుందరయ్య చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి ఘనంగా నివాళులు అర్పించి కామ్రేడ్ సుందరయ్య జోహార్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమానికి హాజరైన సుందరయ్య అభిమానులు సిపిఎం పార్టీ నేతలు ఒక్కొక్కరిగా పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలాభిషేకంతో నివాళులు సమర్పించారు. అనంతరం శిబిరం వద్ద భారీగా ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పట్టణ ప్రజలకు చల్లని మజ్జిగను అందించారు. పట్టణంలోని ప్రజలు భారీగా పాల్గొని మజ్జిగను అందుకొని సేవించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఇక్కడికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నానని సుందరయ్య జీవితాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకొని సక్రమమైన మార్గంలో ప్రయాణించాలని ప్రస్తుత రాజకీయ వ్యవస్థను గతంలోనే సుందరయ్య వివరించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డేవిడ్ రాజుతో పాటు సిపిఎం పార్టీ నేతలు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సందాని, ఆవాజ్ యస్దాని, సిఐటియు అధ్యక్షులు నాగయ్య, ఐద్వా నాయకురాలు గుల్జార్ బేగం, హాజరతయ్యా, గద్దర్ బాబు, పద్మ, రమణయ్య, సాదిక్ హుస్సేన్, ఐ.వి.రమణారెడ్డి, ఎన్ఆర్ఐ మీరామహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవలోనూ దూసుకు పోతున్న బహుజన యూత్ ఫోర్స్



**కోట, (రాజధాని వార్తలు):** ఇటీవల వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో 544 మార్కులు సాధించిన రారా సంతోష్‌ను తన స్వగ్రామమైన మదఫలంకు వెళ్లి వారి కుటుంబాన్ని సందర్శించి అనారోగ్యంతో బాధపడుతున్న సంతోష్ తండ్రికి కొంత ఆర్థిక సహాయాన్ని అందజేసి సంతోషం చదువుకు కావలసిన సహాయాన్ని బహుజన యూత్ ఫోర్స్ అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. మరోసారి మానవత్వాన్ని చాటుకున్న బహుజన యూత్ ఫోర్స్ మట్టిలో మాణిక్యం దారా సంతోష్‌కు అండగా బహుజన యూత్ ఫోర్స్ ఎందరికో ఆదర్శంగా నిలుస్తూ పలువురి ప్రశంసలు పొందుతున్న బహుజన యూత్ ఫోర్స్. తల్లి మరణం తండ్రి అనారోగ్య పరిస్థితి వైద్య ఖర్చుల నిమిత్తం ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందించిన బహుజన యూత్ ఫోర్స్ సంతోష్‌పై చదువులకి అండగా ఉంటామన్న బహుజన యూత్ ఫోర్స్ ఈ కార్యక్రమంలో బహుజన యూత్ ఫోర్స్ కన్వీనర్ శ్రీరామ్ శివప్రసాద్, గౌరవ సలహాదారులు ఐవీ రమణయ్య, కర్లపూడి వెంకటరమణయ్య ఆన్ బిన్ సువండుగల్ సంస్థ డైరెక్టర్ భూపతి మోహన్ సాయి, న్యాయవాది అశోక్ కాంబ్లె,కో కన్వీనర్లు నాగేంద్ర, గౌతమ్, రవి, మీడియా కో ఆర్డినేటర్ చెన్నకేశవ, దేవా బేకారి అధినేత దేవా, కాటయ్య, దారా బాబు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా గంగమ్మ తల్లి జాతర మహోత్సవం



**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట మండలంలోని తారక రామ నగర్‌లో వెలసిన శ్రీశ్రీశ్రీ పర్వతాల గంగమ్మ జాతర మంగళవారం అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా జరిగింది. వేకువజామున అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష అలంకరణలతో జాతర మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది.

అనంతరం భక్తుల దర్శనార్థం సర్వాంగ సుంద రంగా ముస్తాబైన గంగమ్మ తల్లి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా అంబలిని సమర్పించారు. కాయ, కర్పూరం, ఫలపుష్పాలను సమర్పించి తమ మొక్కులను భక్తిశ్రద్ధలతో తీర్చుకున్నారు. సాయంత్రం వేళల్లో మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, అనంతరం కుంభం వేసే కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గ్రామ వీధుల్లో అమ్మవారిని వైభవంగా ఊరేగించారు. మంగళవాయిద్యాల నడుమ సాగిన ఈ ఊరేగింపులో గ్రామస్తులు ప్రతి ఇంటి ముందర అమ్మవారికి హారతులు పట్టి, ప్రత్యేక పూజలు చేసి భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. అమ్మవారి కృపాకటాక్షాల కోసం గ్రామంలోని ప్రజలందరూ ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాలు పంచుకున్నారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సుబ్రహ్మణ్యం రెడ్డి, బుజ్జి నాయుడు, లక్ష్మమ్మ, రామ తులసి, జైచంద్ర, టైగర్ తదితరులు పాల్గొన్నారు. జాతర విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ చైర్మన్ తమ్మిశెట్టి రవీంద్ర, కృష్ణమూర్తిలు కృతజ్ఞతలు తెలిపారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పాస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996


## COMPANIES


- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్కు 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ఇళ్ల ముంగిటకే హస్త కళారూపాలు

**- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత - లేపాక్షి షో రూమ్‌లకు నూతన హంగులు - ఢిల్లీ, కాకినాడ షో రూమ్‌లకు మరమ్మతులు - రాజమండ్రి ఎయిర్ పోర్టులో నూతన షో రూమ్ ఏర్పాటు - హస్త కళాకారులకు 365 రోజుల ఉపాధే లక్ష్యం - ఏపీహెచ్డీసీ అధికారులతో సమీక్షలో మంత్రి సవిత**





**తాడేపల్లి/అమరావతి, (రాజధాని వార్తలు):** లేపాక్షి షోరూమ్‌లను అభివృద్ధి చేయడంతో పాటు ఈ కామర్స్, సోషల్ మీడియా వేదికగా కళారూపాలను నేరుగా వినియోగదారుల ఇళ్లకే డోర్ డెలివరీ చేయనున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. హస్త కళాకారులకు 365 రోజుల పాటు ఉపాధి కల్పనే కూటమి లక్ష్యమని స్పష్టం చేశారు. లేపాక్షి షోరూమ్ లు, హస్తకళా రూపాల విక్రయాలపై తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ హస్తక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీహెచ్డీసీ) అధికారులతో బుధవారం మంత్రి సవిత సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఎండీ విశ్వ, ఇతర అధికారులు పాల్గొని, రాష్ట్రంలో నూతన లేపాక్షి షో రూమ్‌ల ఏర్పాటుతో పాటు ప్రస్తుతమున్న షో రూమ్‌లను వినియోగదారులకు ఆకట్టుకునేలా అభివృద్ధి చేసే అంశాలపై మంత్రి సవితకు వివరించారు. మరమ్మతులు పూర్తిచేసుకున్న ఢిల్లీ, కాకినాడ లేపాక్షి షో రూమ్‌లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, మరమ్మతులు పూర్తి చేసుకున్న లేపాక్షి షో రూమ్‌లను త్వరగా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. రాజమండ్రి ఎయిర్ పోర్టులో నూతన లేపాక్షి షోరూమ్ ఏర్పాటుకు కేంద్ర విమానయాన శాఖ అంగీకారం తెలిపిందని, త్వరగా ఆ షోరూమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని లేపాక్షి షోరూమ్‌లను నూతన హంగులతో వినియోగదారులకు ఆకట్టుకునేలా అభివృద్ధి చేయాలన్నారు. ఈ కామర్స్ ద్వారా హస్త కళారూపాల అమ్మకాలను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియా వేదికను హస్త కళారూపాల విక్రయాలకు అవకాశంగా వాడుకోవాలన్నారు. నేరుగా వినియోగదారుల ఇళ్లకే కళారూపాలను డోర్ డెలివరీ చేసేలా ఈ కామర్స్ వేదికలను వినియోగించుకోవాలన్నారు. ఇప్పటికే ఆప్కో షో రూమ్‌ల ద్వారా చేనేత వస్త్రాలను డోర్ డెలివరీ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న హస్త కళాకారులకు ఏడాది పాటు ఉపాధి కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా హస్త కళారూ పాల అమ్మకాలు పెంచేలా అధికారులు ప్రణాళికలు అమలు చేయాలని మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హస్తక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గల్లీ నుండి ఢిల్లీకి బయలుదేరిన పదవ తరగతి విజేతలు









**గుంటూరు, (రాజధాని వార్తలు):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు గల్లా మాధవి ప్రోత్సాహంతో పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు బుధవారం ఢిల్లీకి బయలుదేరారు. ఢిల్లీలో విహార యాత్రతో పాటు రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ఇతర ఉన్నత స్థాయి వ్యక్తులను కలవనున్నారు. ఈ మేరకు ఏ.టి.అగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ, శాసనసభ్యులు గల్లా మాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుల పట్ల ఉన్న అపోహలు అన్నింటికి, అందరికీ సమాధానం మీరే అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయులు ఉన్నారు, మంచి మౌలిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల ఉన్న అపోహలను పారద్రోలారని ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ర్యాంక్‌లు సాధ్యం అని నిరూపించారని అన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రైవేట్ పాఠశాలలను దాటి ప్రభుత్వ పాఠశాలలు వెళ్లాలనే ఉద్దేశ్యంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ మార్కులు సాధించి మీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు, తమ్ములకు, చెల్లెళ్ళకు స్ఫూర్తిని, ప్రేరణను నింపారని అన్నారు.హోహోపిల్లల చదువులకు బాగా సహకరించి, గొప్ప విజయాలు సాధించడంలో తోడ్పాటును తల్లిదండ్రులు అందించడం పట్ల అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించడంలో, విద్యార్థులను తర్ఫీదు ఇవ్వడంలో ప్రత్యేక దృష్టి సారించిన ఉపాధ్యాయులను "మీ బోధన, స్ఫూర్తి గొప్పదని" అన్నారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులుగా మీరు నమ్మకాన్ని కలిగించారు. స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. విద్యార్థులు ఉన్నత స్థాయిలోకి వెళ్లాలని జిల్లా కలెక్టర్ ప్రేరేపించారు. మిమ్మల్ని ఎవరూ ఆపలేరని, ఇబ్బందులను అధిగమించి లక్ష్యం చేరే వరకు విశ్రమించ వద్దని సూచించారు. ఇటువంటి మంచి కార్యక్రమంను శాసన సభ్యులు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. శాసన సభ్యులు గల్లా మాధవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల కార్యక్రమం అమలు చేయడం మంచి సత్ఫలితాలు ఇచ్చాయన్నారు. గల్లీ నుండి ఢిల్లీకి విద్యార్థులు వెళ్ళుటకు ఎల్.వి.ఆర్ అండ్ సన్స్ అధినేత వెంకటేశ్వరరావు, శ్రీ బ్రమర ట్రస్ట్ అధినేత గల్లా రామచంద్ర రావు ఎంతో సహకారం అందించారని చెప్పారు. ఢిల్లీలో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ఇతర అతిరథ మహారథులను కలవడానికి కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్ అన్ని ఏర్పాట్లు చేసి సహకారం అందించారని తెలిపారు.

విద్యార్థులు మంచి స్ఫూర్తి పొందాలని, భవిష్యత్తులో ఉత్తమ ర్యాంకులు సాధించి, ఉత్తమ స్థాయిలు పొంది, ఉత్తమ పౌరులుగా నిలవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, ఇతర అధికార, అనధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan